జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 05 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 182 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 08:53:17 వరకు నక్షత్రంరేవతి - 27:24:42 వరకు కరణంవిష్టి - 08:53:17 వరకు, బవ - 20:21:24 వరకు పక్షంకృష్ణ యోగంగణ్డ - 25:50:48 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

### అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు

మిగతా 2లో..

## ఎయిర్‌ఫోర్స్ నుంచి అభినందన్ వర్ధమాన్ రిటైర్

### రెండు దశాబ్దాలకు పైగా వర్ధమాన్ విశిష్ట సేవలు

### ప్రైవేటు విమానయాన సంస్థలో కీలక బాధ్యతలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): 2019 బాలాకోట్ వైమానిక దాడుల అనంతరం పాకిస్థాన్ ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసి దేశవ్యాప్తంగా హీరోగా నిలిచిన గ్రూప్ కెప్టెన్ మాజీ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్, భారత వైమానిక దళం నుంచి

మిగతా 2లో..



## జలాశయాల్లో తగినంత

# నీళ్లు లేవు

- ఉన్న నీటిని పొదుపుగా వాడుకోండి
- విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని వాడొద్దు
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి నియంత్రించాలి
- తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన
- నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం..
- వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం
- మరోసారి వాయిదా పడ్డ కృష్ణాబోర్డు భేటీ
- 50 శాతం తెలంగాణ వాటా అడిగాం
- తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు

న్యూఢిల్లీ, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): తెలుగురాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో

మిగతా 2లో..

## కొడంగల్ నియోజకవర్గంలో

# సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

### పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం రేవంత్

### హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా



హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం

మిగతా 2లో..

## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్..

### కేసు నమోదు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): సాధారణంగా ముఖ్యమంత్రులకు భద్రత చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించిన సమయంలో బందోబస్తుకు సంబంధించిన అత్యంత రహస్య వివరాలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన ఘటనలో కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ భద్రతా వివరాలను పోస్ట్ చేసినందుకుగానూ తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు.

మిగతా 2లో..

## కేసీఆర్ చాలా మంచోడు

### హుందాగా రిసీవ్ చేసుకునేవారు

### కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో

మిగతా 2లో..



## నేను సీఎం కావాలనుకుంటున్నా..

### నాపై హరీశ్‌రావు భార్య పోటీ చేయాలి

### ఇంటర్మీడియట్ విద్యను రద్దుకు పన్నాగం

### సీఎం రేవంత్‌రెడ్డి ఆ ఆలోచన విరమించుకోవాలి

### టీఆర్ఎస్ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): తాను తెలంగాణ సీఎం కావాలనుకుంటున్నానని కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తనపై పోటీ చేసేందుకు హరీశ్‌రావు భార్య ముందుకు రావాలని సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు

మిగతా 2లో..



## జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

### జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జుూా-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

మిగతా 2లో..



## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై

# నిరసనలు

### కేటీఆర్ పిలుపుతో కదంతొక్కిన బీఆర్ఎస్ నేతలు

### ప్రజా పాలన కాదు.. కాంగ్రెస్ దోపిడీ పాలన

### మాజీ మంత్రి తలసాని సంచలన ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేటలో

మిగతా 12లో..

## 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

### పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): సెప్టెంబర్ 07 వ తేదీ నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 06 న ఎర్రవల్లి నివాసంలో

మిగతా 2లో..

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు..

### కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. గురువారం రాత్రి తీజ్ వేడుకల్లో ఓ విద్యార్థిపై దాడిచేయడంతో ఘర్షణగా మారింది. అనంతరం గౌతమి, మంజీరా హాస్టళ్లలోని విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో జేఎన్టీయూ రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనతో మిగతా విద్యార్థులు భయాందోళనకు

మిగతా 2లో..

# సంపాదకీయం

## ఏఐకి పెరిగిన ఆదరణ

నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరింగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేడలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024–2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ– సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0–3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87–15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99–89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70–91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10–15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68–5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు. టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి. ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఎఇ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.

## జలాశయాల్లో తగినంత
# నీళ్లు లేవు

మొదటిపేజీ తరువాయి..

ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో



సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ తరుపున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చెరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణీ చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్ ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు. సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు. ఏపీ ఈఎన్సీ సభ్యుడు నరసింహమూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టీఎంసీలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని వెల్లడించారు. తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు.



## కొడంగల్ నియోజకవర్గంలో
# సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

మొదటిపేజీ తరువాయి..

కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

మొదటిపేజీ తరువాయి..

కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

## ఎయిర్‌ఫోర్స్ నుంచి అభినందన్ వర్ధమాన్ రిటైర్

మొదటిపేజీ తరువాయి..

ఘనంగా రిటైర్మెంట్ తీసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో దేశ రక్షణ రంగంలో అందించిన విశిష్ట సేవలకు ముగింపు పలికి, ఆయన ఇప్పుడు తన కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. వైమానిక దళం నుంచి వీడ్కోలు పొందిన అనంతరం ఆయన ఒక ప్రముఖ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ లో కీలక బాధ్యతలు స్వీకరించారు. 2019 ఫిబ్రవరి 27న జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అభినందన్ చూపించిన తెగువ భారత మిలిటరీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడింది. పాతతరం మిగ్-21 బైసన్ ఫైటర్ జెట్‌ను నడుపుతూనే, అత్యాధునిక అమెరికన్ మేడ్ పాకిస్థానీ ఎఫ్-16 విమానాన్ని లాక్ చేసి కూల్చివేసారు. ఆ సమయంలో తన విమానం కూడా దెబ్బతినడంతో పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూభాగంలో పారాచూట్ ద్వారా దిగాల్సి వచ్చింది. పాకిస్థాన్ ఆర్మీ కస్టడీలో ఉన్నప్పటికీ, ఎలాంటి బెరింపులకు లొంగకుండా ఆత్మస్థైర్యంతో, ఆర్మీ సమాచారాన్ని బయటపెట్టకుండా నిలబడిన తీరు దేశ ప్రజలందరినీ ముగ్ధులను చేసింది. విశ్వవ్యాప్తంగా దౌత్యపరమైన ఒత్తిడి, భారత ప్రభుత్వ కఠిన వైఖరి కారణంగా పాకిస్థాన్ ప్రభుత్వం 60 గంటల్లోపే అభినందన్‌ను వాఘా సరిహద్దు ద్వారా సురక్షితంగా భారత్‌కు అప్పగించక తప్పలేదు. ఆయన చూపిన అసాధారణ ధైర్యసాహసాలకు గాను భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత మిలిటరీ పురస్కారం వీరచక్ర తో గౌరవించింది.

## జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

మొదటిపేజీ తరువాయి..

వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువజామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జూూా-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల బరువు ఉన్న -05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన[illegible]-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది. మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు..

మొదటిపేజీ తరువాయి..

గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హాస్టల్ సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని విద్యార్థులను నిలువరించారు. విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు.. హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌లో తీజ్ కార్యక్రమం సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం మొదలైంది. దీంతో మాటా మాటా పెరిగి.. ఘర్షణగా మారింది. ఈ ఘటనపై వర్సిటీ యాజమాన్యం విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మొలకల పండుగ తీజ్. ప్రకృతి ఆరాధన వేడుకల్లో అవివాహిత యువతులదే ప్రధాన పాత్ర. ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్టమట్టితో వస్త్రంలో గోధుమలను విత్తుతారు.

## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్..

మొదటిపేజీ తరువాయి..

మొదట ఈ ఫిర్యాదుతో జులై 14న ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కోసం ఈ కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీ-రిజిస్టర్ చేశారని సమాచారం. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 13న సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ పూర్తి షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లపై ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఎ, డీజీపీ వంటి ఉన్నతాధికారులకు ఒక వైర్‌లెస్ సందేశం ద్వారా సమాచారం పంపాం. జెడ్ ప్లస్ (ం) కేటగిరీ భద్రతకు అనుగుణంగా చేసిన ఈ ఏర్పాట్ల సందేశంలో సీఎం బ్లడ్ గ్రూప్, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి అత్యంత సున్నితమైన అంశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటన కొనసాగుతుండగానే ఈ అత్యంత రహస్య వైర్‌లెస్ సమాచారాన్ని తెలుగు స్క్రైబ్ అనే ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి భద్రతాపరమైన వివరాలన్నీ బహిర్గతమయ్యాయి. నిబంధనల ప్రకారం వైర్‌లెస్ సందేశాలను బయటకు పొక్కనివ్వకూడదు. అయితే అధికారుల్లో ఎవరైనా అక్రమంగా ఈ సమాచారాన్ని ఆ సోషల్ మీడియా ఖాతాకు చేరవేసి ఉంటారని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ విధి నిర్వహణలో తలెత్తిన లోపం, సీఎం రేవంత్ భద్రతా ఉల్లంఘనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జూన్ 14న ఖైరతాబాద్ పీఎస్‌లో కేసు నమోదుకాగా, సమగ్ర దర్యాప్తు కోసం సైబర్ క్రైమ్ విభాగానికి కేసు బదిలీ చేసి రీ రిజిస్టర్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

## 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

మొదటిపేజీ తరువాయి..

మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

## నేను సీఎం కావాలనుకుంటున్నా..

మొదటిపేజీ తరువాయి..

చేసిన ఆమె.. ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆకునూరి మురళి కమిషన్, విద్యా విధానాలు, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపైనా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. తన రాజకీయ భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన కవిత.. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని బహిరంగంగా వెల్లడించారు. అంతేకాదు.. తన రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ.. హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని పేర్కొన్నారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. హైదరాబాద్‌లో తెలంగాణ ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' సదస్సులో పాల్గొన్న కవిత.. ఈ వ్యాఖ్యలకు తెరలేపారు. ఈ సందర్భంగా ఆమె తన రాజకీయ లక్ష్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. తాను సీఎం కావాలనుకుంటున్నా అని స్పష్టం చేసిన కవిత.. ముఖ్యమంత్రి పదవి కేవలం అధికారానికి సంబంధించినది కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం కూడా ఉండాలని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రత్యర్థులపై స్పందించిన కవిత.. హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని సవాల్ చేశారు. గతంలో తాను హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన విషయం వాస్తవమేనని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయన భార్య తనపై పోటీ చేస్తే కూడా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు రెడీగా ఉన్నానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపైనా కవిత తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, ముఖ్యమంత్రి ప్రకటనల మధ్య పొంతన కనిపించడం లేదని ఆరోపించారు. ఇకపై రేవంత్‌రెడ్డి చర్యలను తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదని.. రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్ అంటే సరిపోతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీఎం పదవికి ఉండాల్సిన గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాలని సూచించారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యను ఎత్తివేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యను రద్దు చేయబోమని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా ప్రకటించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేస్తే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## పాస్ పోర్ట్ పోయినది

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కూతాటి మనోజ్ కుమార్, తండ్రి, రాజయ్య, గారి పాస్‌పోర్ట్ 20-08-2026, రోజున బొమ్మనపల్లి నుండి కరీంనగర్ కి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గంమధ్యలో కుతాటి మనోజ్ కుమార్ ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్ పోర్ట్ నెంబర్ X7130369, తేదీ:27-02-2023 రోజు జారీ చేయడమైనది. కావున ఎవరికైనా పాస్ పోర్ట్ దొరికినచో ఇవ్వగలరు. వారికి తగిన పారితోషకము ఇవ్వబడును.

సంప్రదించావల్సిన నెంబర్: 6309353546,94913 66546.

## మంచిర్యాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు

– పలు ఆలయాల్లో భక్తుల సందడి..
కృష్ణనామస్మరణతో మార్మోగిన పట్టణం
– కాలనీలు, పాఠశాలల్లో ఉట్టి కొట్టే వేడుకలు..
శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారుల సందడి





**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాలు, కాలనీలు, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో ఎక్కడ చూసినా పండుగ సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పలు ఆలయాలను పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, వెన్న, పండ్లు తదితర నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో భజనలు, కీర్తనలు, కృష్ణనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. నిర్వాహకులు ముందుగానే ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఎత్తులో కుండలను వేలాడదీశారు. కుండలను పూలు, రంగురంగుల వస్త్రాలతో అందంగా అలంకరించి వాటిలో వెన్న, పెరుగు, పండ్లు తదితర ప్రసాదాలను ఏర్పాటు చేశారు. యువత, చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. యువకులు ఒకరిపై ఒకరు ఎక్కి మానవ పిరమిడ్‌లుగా ఏర్పడి ఎత్తులో ఉన్న ఉట్టిని కొట్టేందుకు పోటీపడ్డారు. ఉట్టి కొట్టే సమయంలో కాలనీ వాసులు కృష్ణనామస్మరణ చేస్తూ, కేరింతలు కొడుతూ పాల్గొనడంతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

**పాఠశాలల్లోనూ ఉట్టి కొట్టే వేడుకలు :** పట్టణంలోని పలు పాఠశాలల్లో కూడా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఏర్పాటు చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అలంకరించిన కుండలను ఎత్తులో ఏర్పాటు చేయగా.. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి వాటిని కొట్టేందుకు ప్రయత్నించారు. తోటి విద్యార్థులు చప్పట్లు కొడుతూ, కేరింతలు వేస్తూ తమ సహచరులను ప్రోత్సహించారు.

**శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారుల సందడి :** పాఠశాలల్లో శ్రీకృష్ణుడు, రాధాదేవి, గోపికల వేషధారణలో వచ్చిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు వేణువును చేతబట్టి, నెమలి పింఛం ధరించి అలరించారు. రాధ, గోపికల వేషధారణలో వచ్చిన బాలికలు అందరినీ ఆకట్టుకున్నారు.

విద్యార్థులతో కృష్ణ భక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతం, ఆయన జీవిత విశేషాలు, భగవద్గీత సందేశం, ధర్మ పరిరక్షణలో శ్రీకృష్ణుడి పాత్రను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు కూడా కార్యక్రమాల్లో పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. పట్టణంలోని అనేక కుటుంబాలు తమ ఇళ్లలో శ్రీకృష్ణుడి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో కృష్ణుడి పాదముద్రలను ఇంటి గుమ్మం నుంచి పూజా మందిరం వరకు ఏర్పాటు చేసి బాలకృష్ణుడు ఇంట్లోకి వచ్చినట్లుగా అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి వెన్న, పాలు, పెరుగు, పండ్లు తదితరాలను నైవేద్యంగా సమర్పించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలు, కాలనీలు, పాఠశాలలు, ఇళ్లలో భక్తి వాతావరణం నెలకొంది. ఉట్టి కొట్టే కార్యక్రమాలు, చిన్నారుల వేషధారణలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మంచిర్యాల పట్టణం మొత్తం పండుగ శోభను సంతరించుకుంది. ధర్మం, సత్యం, నీతి, మానవతా విలువలను బోధించిన శ్రీకృష్ణుడి సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పలువురు ఆకాంక్షించారు. భక్తి, ఆనందోత్సాహాల మధ్య శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి.

## కొండా సురేఖ బర్తరఫ్‌ను ఖండిస్తూ కళ్లకు గంతలతో నిరసన

– బీసీ బిడ్డపై చర్యలు అన్యాయం.. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
– లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం
– బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు



**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండిస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో పలువురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులు పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించిన సందర్భాల్లో ఎలాంటి చర్యలు తీసుకోని కాంగ్రెస్ అధిష్ఠానం, బీసీ బిడ్డగా ఉన్న కొండా సురేఖపై తనకు సంబంధం లేని వ్యాఖ్యల విషయంలో చర్యలు తీసుకోవడం అన్యాయమని విమర్శించారు. ఒకే పార్టీలో ఒక సామాజిక వర్గానికి ఒక న్యాయం, బీసీలకు మరో న్యాయం చేయడం తగదని అన్నారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉన్నారని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. "సామాజిక న్యాయం మాతోనే సాధ్యం.. బీసీలకు కాంగ్రెస్ పార్టీలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం" అని చెప్పే కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం బీసీ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖపై తీసుకున్న బర్తరఫ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆమెకు బాసటగా నిలుస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. బీసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, న్యాయవాది కర్రే లచ్చన్న, రాష్ట్ర నాయకులు గజ్జల్లి వెంకటయ్య, తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాచర్ల సదానందం, నాయకులు శాఖపురి భీమ్‌సేన్, వేముల అశోక్, వేముల కిరణ్, చంద్రగిరి చంద్రమౌళి, ఎండీ లతీఫ్, సురేంద్రచారి, చెలిమెల అంజయ్య, గగ్గూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ విఫలం... వెంటనే రాజీనామా చేయాలి : ఆదే గజేందర్



**బజార్హత్నూర్ సెప్టెంబర్ 04, (ప్రజా జ్యోతి:** ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో కలిసి ఆదే గజేందర్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదే గజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. అయితే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ ప్రజల మధ్యకు రాకుండా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు.



ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని సలహాలు ఇచ్చే బాధ్యతగా వ్యవహరించలేక పోతున్నారని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆదే గజేందర్ విమర్శించారు. కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు .అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరించే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. "కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్ అనిల్ జాదవ్.. మా కార్యకర్తలకు అండగా నేను ఎప్పుడూ ఉన్న" అని ఆదే గజేందర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళెం విఠల్,ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,మాజీ మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్,మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ రమేష్,ఎస్సీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బొమ్మెత నర్సయ్య, మాజీ జడ్పీటీసీ మునేశ్వర్ నారాయణ,నాయకులు జంగుబాపు, శివుడు,అరే పండు, డీసీసీ కార్యదర్శి దీసి విజేందర్,గణేష్ జాదవ్,బత్తిని కిషన్,కనిందే మాధవ్,ప్రధాన కార్యదర్శి గొల్లనాగు రమేష్,సమ సురేష్ రెడ్డి, పోరెడ్డి నారాయణ,సర్పంచ్లు రజాక్, కృష్ణకత్ రెడ్డి,యువ నాయకులు సయ్యద్ సల్మాన్, శరత్,రాజు,సన్నీ,రవి తదితరులు పాల్గొన్నారు.

# కొండ సురేఖ స్వయంకృతాపారాధమే

– మంత్రి పదవి వియోగం
– ముఖ్య మంత్రిపై అభియోగం మోపడం సరికాదు
సీఎం,సుపరిపాలనకు
– మద్దతు గానే ఉంటాం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్
"ప్రజా జ్యోతి "తో వెల్లడి వెల్లడి



**ఖానాపూర్ సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి) :** కొండ సురేఖ కుటుంబ స్వయం కృపారాధమే మంత్రి పదవి బర్తరఫ్ (వియోగానికి) కారణం అని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు ఆదివాసి పోరు బిడ్డ వెడమ బొజ్జు పటేల్ "ప్రజా జ్యోతి"తో అన్నారు. ప్రభుత్వంలో ప్రజా కాంగ్రెస్ పార్టీకి క్రమశిక్షణతో కూడిన విలువలు ఉన్నాయని అధిష్టానం సూచనల మేరకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించారు తప్ప అది వ్యక్తిగతం కాదని సీఎం రేవంత్ రెడ్డి పై వ్యక్తిగత విమర్శలు ఇకనైనా మానుకుంటే బాగుంటుందని కొండా సురేఖకు సూచించారు ముఖ్యమంత్రి పాలన పట్ల వ్యక్తిగతంగా వ్యతిరేకత ఉందని కొండ సురేఖ వ్యాఖ్యలు అనుచితం అని సీఎం రేవంత్ రెడ్డి సుపరిపాలనకు ఎమ్మెల్యేలుగా తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు ఎవరో చెప్తే ప్రెస్ మీట్ లు పెట్టి కొండ సురేఖ పై మాట్లాడమని తెలపడం అవివేకమని శాసనసభ్యులుగా ఎమ్మెల్సీలుగా ఉన్న పదవుల్లో ఉన్న వ్యక్తులు ఒక చదువుకున్న మేధావులు గానే స్పందించి కొండ సురేఖ మంత్రిని కాకుండా ఆమె కూతురి వాక్యాలను పత్రికాముఖంగా తప్పు పట్టింది వాస్తవం అని అన్నారు దీన్ని సురేఖ దంపతులు ఖండించకపోగా కూతురు వ్యాఖ్యలు వ్యక్తిగతమని ప్రకటించడం ఎంత మేరకు సమంజసము వాళ్లే పునరాలోచించుకోవాలని అన్నారు ఒకే పార్టీలో ఉంటూ ఎమ్మెల్యే టికెట్ విషయంలో ఇంకా రెండున్నర సంవత్సరాలు ప్రభుత్వం ఉండగా దుందుడుకు చర్యగా పిల్ల చేష్టలుగా క్రమశిక్షణ రాహిత్యం వహించి ఏకంగా ముఖ్యమంత్రి పైన చేసినఅనుచిత వ్యాఖ్యలు సమర్థించడం అధిష్టానాన్ని ముఖ్యమంత్రి హోదాను కించపరచడమేమని బొజ్జు పటేల్ వివరించారు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గత పదేండ్ల నిరంకుశ బిఆర్ఎస్ పాలనలో మంత్రులను ఎమ్మెల్యేలను కూడా కల్వనివ్వని సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో నేరుగా కలిసి అవకాశాలను ఇచ్చి పార్టీతో పాటు ప్రభుత్వ నిబంధనలతో పాటు ప్రజా సంక్షేమంపై సుదీర్ఘ చర్చలు జరిపిన విషయం మంత్రి కొండ సురేఖ మర్చిపోయారేమోనని అన్నారు రేవంత్ రెడ్డి పాలన సముచితంగా ఉంది కాబట్టే 1000 రోజుల సుపరిపాలనకు విజయోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని అన్నారు గ్రూపులకు వర్గాలకు కులాలకు మతాలకు తేడా లేకుండా పరిపాలన కొనసాగిస్తున్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి బాటలోనే పయనిస్తామని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాసనసభ్యులు బొజ్జు పటేల్ స్పష్టం చేశారు పార్టీతోపాటు ప్రజలకు అనుకూలంగా పాలన సాగించేందుకు సహచర ఎమ్మెల్యే తో గాని మంత్రులతో కానీ ఎలాంటి విభేదాలు తమకు లేవని కేవలం పార్టీ ప్రభుత్వ అధిష్టాన సిద్ధాంతం మేరకే పని చేస్తున్నామని ఈ సందర్భంగా "ప్రజా జ్యోతి"తో తెలిపారు.

# అంతర్రాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

– ఆరుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు – 47 పశువులు, లారీ, గంజాయి స్వాధీనం.. మరో ముగ్గురి కోసం గాలింపు



**నేరడిగొండ సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి) :** రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపైకి వాహనాలను ఉద్దేశపూర్వకంగా ఎక్కించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో అంతర్రాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠాకు చెందిన ఆరుగురు నిందితులను నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 47 పశువులు, కంటైనర్ లారీ, 4 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ వెల్లడించారు.

**ఘటన నేపథ్యం :** సెప్టెంబర్ 1న ఉదయం నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద టోల్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా, నేరడిగొండ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో ఎస్ యు వి (ఎంహెచ్ 34 సీడీ 5318)ను నిలిపేందుకు యత్నించారు. అయితే నిందితులు వాహనాన్ని ఆపకుండా టోల్ గేట్లను ఢీకొడుతూ వేగంగా దూసుకెళ్లారు.

వెనుకనే వస్తున్న కంటైనర్ లారీ (ఎం హెచ్ 40 సీఎం 2712) కూడా సైన్ కోన్లు, డివైడర్లను ఢీకొట్టి పరారైంది.

**పైలెట్ వాహనంగా బొలెరో.. :** నిందితులు ముఠాగా ఏర్పడి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పశువుల లారీకి ముందు బొలెరో వాహనాన్ని పైలెట్‌గా ఉపయోగిస్తూ, మార్గమధ్యంలో పోలీసుల తనిఖీల సమాచారాన్ని లారీ డ్రైవర్‌కు చేరవేస్తున్నట్లు గుర్తించారు.

పోలీసుల వేగవంతమైన చర్యలు:

సెప్టెంబర్ 3న తెల్లవారుజామున కుంటాల గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా అనుమా నాస్పదంగా కనిపించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి సమాచారంతో ఆదిలాబాద్‌లో ఉన్న మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు.

**అరెస్టయిన వారు :**

ఎండి. షఫీ ముదస్సిర్ (ఆదిలాబాద్), ఫిర్దోస్ బెగ్, మహమ్మద్ హైదర్ అలీ, క్షితిజ్ భీమ్‌రావు సేవట్కర్ (నాగ్‌పూర్), గోపాల్ సింగ్ షెకావత్ (ఆదిలాబాద్), సందీప్ విఠల్ ముప్పిడివార్ (యవత్మాల్). – పరారీలో ఉన్నవారు: మహమ్మద్ మజార్, రాజు, రవి జగదీష్ బాగ్డేల్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు :** నిందితుల నుంచి 24 ఎద్దులు, 23 ఆవులు (మొత్తం 47) స్వాధీనం చేసుకున్నారు. రవాణాలో 3 పశువులు మృతి చెందగా, మిగిలిన 44 పశువులను గోశాలకు తరలించారు. వీరితో పాటు కంటైనర్, గంజాయి, ఫోన్లను సీజ్ చేశారు.

**కేసు నమోదు – రిమాండ్ :**

టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ యెంపల్లి రామయ్య ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 259/2026 కింద తొమ్మిది మందిపై బిఎంఎస్, జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, గోవధ నిరోధక చట్టం, ఎన్‌డిపిఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ఆరుగురిని బోథ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసీ కాంగ్రెస్ కమిటీలకు దరఖాస్తుల స్వీకరణ

ఆదివాసీ కాంగ్రెస్ బలోపేతానికి కసరత్తు



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి :** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా, మండల కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ నియామకాల అబ్జర్వర్ రాథోడ్ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీ హక్కులు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాథోడ్ గణేష్, అజ్మీరా శ్యామ్ నాయక్, ఏఎంసీ చైర్మన్ మంగలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జక్కయ్య, మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, మాజీ సర్పంచ్ కాశయ్య, మాజీ ఎంపీటీసీ నారాయణ, అంకుసాపూర్ సర్పంచ్ గంగారం, వైస్ ప్రెసిడెంట్ భీమారావు, టౌన్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, కార్యదర్శి శీతల, రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ జిల్లా అధ్యక్షురాలు కోవా ఇంద్రతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకలు



**బజార్హత్నూర్ సెప్టెంబర్ 04,(ప్రజా జ్యోతి):** ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలోని సన్ సైన్ స్కూల్లో శుక్రవారం కృష్ణష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ

విద్యార్థులు చిన్ని కృషునుని వేశాధారణ లో విద్యార్థినిలు గోపిక వేశాధారణ లో వచ్చి ఉట్టి కుండను పగలగొట్టేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, సంజయ్, రాకేష్, అధ్యాపక బృందం, తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమా...?

కుప్టి హైవే సమస్యపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహం



**నేరడిగొండ, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండలంలోని కుప్టి వద్ద జాతీయ రహదారి ( ఎన్ హెచ్ –44)పై నెలకొన్న సమస్యలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరిశీలించారు. హైవేపై ఏర్పడిన గుంతలు, బ్రిడ్జిపై చేపట్టిన సింగిల్‌వే కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన పరిశీలించి, హైవే అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన ఎన్ హెచ్ –44పై ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాంటి జాతీయ రహదారిపై కుప్టి వద్ద గుంతలు ఏర్పడి రోజుల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అదేవిధంగా బ్రిడ్జిపై సింగిల్‌వే కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజల ప్రాణాల కంటే తనకు ఏదీ ముఖ్యంకాదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. హైవే సమస్యపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాధానం ఇవ్వకపోయినా, పనులు పూర్తి చేయడంలో జాప్యం చేసినా ప్రజలతో కలిసి హైవే దిగ్బంధం చేపడతానని ఆయన హెచ్చరించారు.

## అమ్మవారికి అక్షరమాల పట్టు చీర సమర్పణ





**బాసర, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి) :** సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు సల్ల జగదీష్ అకుంఠిత దీక్షతో మగ్గంపై 56 తెలుగు అక్షరాలను నేసి రూపొందించిన పట్టు చీరను చదువుల తల్లి సరస్వతీ దేవికి శుక్రవారం సమర్పించారు. బాసర పుణ్యక్షేత్రంలోని బాలాలయంలో ఆలయ అర్చకులు, అధికారుల సమక్షంలో మంగళవాయిద్యాల నడుమ చీరను అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు అఖిల భారతీయ పద్మశాలి నిత్య అన్నదాన సత్రం నుంచి చేనేత కార్మికుడు సల్ల జగదీష్, సంఘ సభ్యులు, భాజా భజంత్రీలతో కలిసి మంగళవాయిద్యాల నడుమ అక్షరమాల పట్టు చీరను బాలాలయానికి తీసుకువచ్చారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణలతో అమ్మవారికి చీరను సమర్పించారు. 56 తెలుగు అక్షరాలతో పట్టు చీరను రూపొందించిన చేనేత కార్మికుడు సల్ల జగదీష్‌ను ఆలయ ఈవో అంజనీదేవి ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా రూపొందించిన ఈ చీరను అమ్మవారికి సమర్పించడం పట్ల జగదీష్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బాసర సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, పద్మశాలి సంఘ సభ్యులు రాపోలు సుధాకర్, కే. గంగాధర్, స్వామి, అశోక్, రమేష్, రాజు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు సంబరాలు

- కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: కాంగ్రెస్ నేతల డిమాండ్
- రేవల్లి, ఏదుల మండలాల్లో భారీ బైక్ ర్యాలీ

రేవల్లి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రేవల్లి, ఏదుల మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు ఈ





కార్యక్రమాలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. రేవల్లి, ఏదుల మండల కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పాల్గొని బాధ్యతలు నిర్వర్తించని పక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేవల్లి, ఏదుల మండలాల ఇన్‌చార్జి కొల వెంకటేష్, రేవల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుల్తాన్ అలీ, ఏదుల మండల అధ్యక్షుడు సుకేందర్‌రెడ్డి, ఉమ్మడి గోపాలపేట మార్కెట్ యార్డు చైర్మన్ ఎక్కె వెంకటేష్, వైస్ చైర్మన్ మంద సత్యశీలారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోడే రఘు, రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కె. బంగారు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మిద్దె రాములు, బీసీ సెల్ అధ్యక్షుడు కురుమయ్య, మైనార్టీ సెల్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు - 2026

- మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు ఘనంగా ప్రదానోత్సవం

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి కృషిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో "జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు – 2026" ప్రదానోత్సవ కార్యక్రమం నేటి (05-09-2026) సాయంత్రం 3 గంటలకు స్థానిక ఐ.డి.ఓ.సి. (కలెక్టరేట్ సమావేశ మందిరం)లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి ఎంపికైన 69 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలు దక్కనున్నాయి. విద్యా బోధనలో ప్రతిభ కనబరిచిన ఎస్జీటీ, ఎస్ ఏ, జీహెచ్‌ఎం, పీఇటీ తదితర హోదాల్లోని ఉపాధ్యాయులను బాలానగర్, భూత్పూర్, సి.సి.కుంట, దేవరకద్ర, గండీడ్, హన్వాడ, జడ్చర్ల, కొయిల్‌కొండ, మహబూబ్‌నగర్ (గ్రామీణ/పట్టణ), మిడ్జిల్, మహమ్మదాబాద్, ముసాపేట్, నవాబ్‌పేట్, రాజాపూర్ మండలాల నుంచి ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం సూపరింటెంట్ బోగాది మురళి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొననున్నారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.

# పేద కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండ

-కిడ్నీ మార్పిడి చికిత్సకు రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

గద్వాల(ప్రజా జ్యోతి)సెప్టెంబర్ 04:
జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన యం.భగవాన్ జి కుమారుడు యం.ఉదయ్ సాయి కిడ్నీ బాధతో కొన్ని ఏండ్లు



ఇబ్బందులు గురికాగా కిడ్నీ మార్పిడి చికిత్స కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు చేసింది.హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉదయ్ సాయి కుటుంబానికి ఎల్ఓసీ పత్రాన్ని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ అందజేశారు.ఈసందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ,పేద,సామాన్య ప్రజలకు వైద్య సహాయం అందించడమే ప్రజా పాలన లక్ష్యమన్నారు.ఉదయ్ సాయి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో అవసరమైన సహాయాన్ని అందిస్తామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. తమ కుమారుడి చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంపత్ కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి:జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.జె.సంధ్యా కిరణ్మయి

గద్వాల సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు,సంబంధిత సిబ్బంది చిన్నారులకు వేసిన టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.జె.సంధ్యా కిరణ్మయి



సూచించారు.జాతీయ స్థాయిలో టీకాల కార్యక్రమం అమలు తీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు,టీకాలు పొందిన ప్రతి చిన్నారి వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేయడం ఎంతో కీలకమని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.అస్గర్ అలీ తెలిపారు.పిల్లలకు పుట్టిన నాటి నుంచి 17 సంవత్సరాల వయస్సు వరకు జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం నిర్దేశించిన అన్ని రకాల టీకాలను సకాలంలో వేయించాలని సూచించారు.భౌతికంగా టీకా వేసిన వెంటనే సంబంధిత వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని,ఎలాంటి వివరాలు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు,సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.టీకాల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకుండా,యు-విన్ పోర్టల్‌లో వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించాలని వారు సూచించారు.

# హామీలు బోలెడు.. అమలు మాత్రం మూరెడు!

- వెయ్యి రోజులైనా హామీల అమలు ఏదీ?
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ వంటావార్పు
- పెన్షన్లు పెంచాలి.. మహిళలకు రూ.2,500 ఇవ్వాలి
- 420 హామీలతో ప్రజలను మోసం చేశారంటూ బిఆర్ఎస్ నాయకుల ఆరోపణలు

వనపర్తి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):
అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రధాన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీల అమలును డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం వనపర్తి గాంధీచౌక్‌లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, వికలాంగుల పెన్షన్లను పెంచడంతో పాటు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి , విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా






బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలస రమేష్ గౌడ్, వనపర్తి మండల అధ్యక్షుడు కే. మాణిక్యం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రధాన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా వితంతువులు, హెచ్ఐవీ బాధితులకు ఆసరా పెన్షన్లు అందించిందని వారు గుర్తుచేశారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్లను పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్లను మరింత పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అయితే వెయ్యి రోజులు గడిచినా ఆ హామీ అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల్లోనే అభివృద్ధిని చేసి చూపించాం:డీసీసీ అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి

గద్వాల సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే చేసి చూపించిందని జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు.జిల్లా కేంద్రంలోని డీసీసీ ప్రజా బంగ్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో 90 శాతం ఇప్పటికే అమలు చేశామని తెలిపారు.గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజలకు చెప్పుకోదగ్గ ప్రయోజనం కలగలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.గ్రామాల్లో ప్రధాన సమస్యగా ఉన్న అంతర్గత రహదారుల నిర్మాణంతో పాటు,మండల ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ప్రధాన రహదారుల సమస్యల పరిష్కారానికి కోట్లాది రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం




తెలిపిందని వివరించారు.ఉన్నత విద్యను పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత కోసం పోలీస్,అటవీ శాఖ తదితర విభాగాల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిపక్షాలు రాజకీయ కోణంలో చూడకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారని రాజీవ్‌రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు గట్టు గౌస్, మద్దిలేటి,ప్రధాన కార్యదర్శులు శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,సంకాపురం రాముడు,మధు నాయుడు,కాకులారం నర్సింహులు,నగేష్,టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధరూర్ రవి,నరేందర్,ఉప్పల్ తిమ్మారెడ్డి,ఆయా మండలాల అధ్యక్షులు ఎర్రవల్లి నర్సిరెడ్డి, లక్ష్మేందర్‌రెడ్డి,ఆంజనేయులు,రాజు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కులగణనపై పార్లమెంట్‌లో గళమెత్తండి

- క్రీమీలేయర్‌పై స్పష్టత కావాలి
- ఓబీసీ గళం రాహుల్‌కు వినిపించిన ఏఐఓబీసీ విద్యార్థి నాయకుడు జయంత్ యాదవ్
- రాహుల్ గాంధీతో ఓబీసీ విద్యార్థి నేతల భేటీ

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):
దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో ఓబీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, కులగణనతో పాటు క్రీమీలేయర్ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్‌ఏ) నాయకులు కోరారు. ఢిల్లీలోని రాహుల్ గాంధీ నివాసంలో ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్, ఓబీసీ విద్యార్థి నాయకుడు పెండెం జయంత్ యాదవ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం భేటీ అయింది. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో ఓబీసీలకు



సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దేశంలో సమగ్ర, శాస్త్రీయ కులగణన చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ రంగాల్లో ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని జయంత్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. క్రీమీలేయర్ నిబంధనల అంశంపై కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన రాహుల్ గాంధీ, తెలంగాణకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, రాబోయే సమావేశంలో ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు ప్రతినిధి బృందం తెలిపారు. తమ సమస్యలను ఓపికగా విని స్పందించిన రాహుల్ గాంధీకి సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌యూ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, హెచ్‌సీయూ విద్యార్థి ప్రతినిధులు దీపా కుమారి, రాకేశ్ దత్తా, పింకీ, శశికాంత్, రాకేశ్ కుమార్, రజనీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

-తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ జిల్లా ఇంచార్జ్ సరప్ నాగరాజు
- తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ నియోజకవర్గ కన్వీనర్ గా జి. నీలప్ప ముదిరాజ్ ఎన్నిక

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి):
తెలంగాణ సాయుధ ఉద్యమంలో పాల్గొని ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరుల కుటుంబాలతోపాటు ప్రతి ఒక్క ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆర్థికంగా నష్టపోయి వెనుకబడినటువంటి ఉద్యమకారులను ఆర్థికంగా ఆదుకొని ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సరప్ నాగరాజు అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని స్థానిక శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సరప్ నాగరాజు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరప్ నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారుడిని ఆదుకుంటానని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి మరిచిపోయిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్క ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించే దిశగా ఈ ప్రాంతం మంత్రి వాకిటి శ్రీహరి ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన విధంగానే తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి నెలకు 25000 పెన్షన్,250 గజాల ఇళ్ల స్థలాలు ఇచ్చి తెలంగాణ ఉద్యమకారుల కాలనీలుగా గుర్తించడంతో పాటు ఫ్రీ బస్ పాస్‌లు,హెల్త్‌అ కార్డు లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలుపరిచి తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసులైన జైలుకు పంపించిన బైండోవర్ కేసులు పెట్టిన అదరక బెదరక నిలబడిన ఉద్యమకారులను గుర్తించి తప్పకుండా





ఆదుకోవాలని వారి కోరారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ నియోజకవర్గ కన్వీనర్ గా జి.నీలప్ప ముదిరాజ్ ను ఉద్యమకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ జహీద్ మంగ్య నాయక్,రమేష్ గౌడ్,కడెం పల్లి మోహన్నైతు, భగవంతు,బీజేపీ నాయకులు కల్లూరి,నాగప్ప,ప్రజా ఫ్రంటు మాజీ నాయకులు కర్రెమ్ కృష్ణ,తెలంగాణ ఉద్యమ నాయకులు రాలింగం,కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ భుట్టో విద్యార్థి సంఘం నాయకులు బి.భాస్కర్, మాజీ కౌన్సిలర్ చీరాల సత్యనారాయణ, ఫొటో గ్రాఫర్ అంబదాస్,పాలకృష్ణ,మల్లేష్, ఖాజా, కృష్ణ,మినాన్ పాల్గొన్నారు.

# "విద్యా వాలంటీర్లు పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శకులు"

- రూ.10 లక్షలతో 100 మంది వాలంటీర్లకు తొలి నెల గౌరవ వేతనం

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 4( ప్రజా జ్యోతి బ్యూరో ):
విద్యా వాలంటీర్లు కేవలం పాఠాలు చెప్పేవారు కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులుగా పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 'శతశాతం' కార్యక్రమం కింద 100 ప్రభుత్వ పాఠశాలలకు ఎంపికైన 100 మంది విద్యా వాలంటీర్లకు తన సొంత నిధులతో తొలి నెల గౌరవ వేతనంగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.10 లక్షలు అందజేశారు. విద్యార్థుల్లో చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక మార్గదర్శనం అందించాలని సూచించారు.



క్రీడలు, కళలు తదితర రంగాల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. 'శతశాతం' కార్యక్రమాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తామని, త్వరలో విద్యార్థులకు క్యూఆర్ కోడ్ డిజిటల్ బుక్స్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్.పి. వెంకటేష్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం:బీఆర్ఎస్ నేత బాసు హనుమంతు నాయుడు

మల్దకల్ సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం మల్దకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.మల్దకల్ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.వికలాంగులు, మహిళలు,విద్యార్థులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.అంతకుముందు శ్రీశ్రీశ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులు,వృద్ధులు,మహిళలు,విద్యార్థులతో పాటు అన్ని వర్గాలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.పుట్టిన బిడ్డకు అందాల్సిన కేసీఆర్ కిట్ నుంచి విద్యార్థులకు ఫీజు కార్డులు,యువతులకు స్కూటీలు,వివాహమైన మహిళలకు రూ.1,00,116తో పాటు తులం బంగారం,ఆసరా పింఛన్లను రూ.4 వేలకు,దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు.పుట్టిన బిడ్డ నుంచి పండు వృద్ధుల వరకు,విద్యార్థుల నుంచి రైతులు,రైతు కూలీలు,ఆటో కార్మికుల వరకు ప్రతి






వర్గానికి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ ఉందో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రతి కాంగ్రెస్ నాయకుడిని హామీల అమలుపై నిలదీసి,ప్రజలకు రావాల్సిన హక్కులను సాధించుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.ప్రజలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని,ప్రభుత్వం హామీల అమలుపై స్పందించే వరకు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు,మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల,జి.రాఘవేంద్రరెడ్డి,పటేల్ జనార్దన్‌రెడ్డి,ప్రతాప్,డి.శేఖర్ నాయుడు,సర్పంచులు సత్యాన్న,సాకి డేవిడ్,భరత్ సింహారెడ్డి,తిరుమలేష్,బాసు గోపాల్,వెంకటేష్ నాయుడు, మధుకుమార్,ఆంజనేయులు,సి.కె.రంగన్న,మాలిక్,రమేష్,నాగరాజు,లక్ష్మారెడ్డి,శ్రీను, చంద్రశేఖర్,రాముడు,మల్లికార్జున్,మహేందర్,నరేష్,నరసింహులు,ఓబులేష్‌తో పాటు సీనియర్ నాయకులు,వివిధ గ్రామాల పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయాల్లో చెరగని సంతకం

**- కొండా దంపతులు**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ చరిత్రలో ధిక్కార స్వభావానికి ప్రతీక కొండా సురేఖ – మురళి దంపతులు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా వారిలో ఈ ధిక్కార ధోరణి కనిపిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా ఆమె కూతురు కొండా సుస్మితా పటేల్ సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడటం, ఆ తర్వాత మంత్రివర్గం నుండి సురేఖ బర్తరఫ్ కు గురికావడం జరిగింది. అయితే ముఖ్యమంత్రులు, సొంత పార్టీ నాయకుల పట్ల ధిక్కారాన్ని ప్రదర్శించడం వారికి కొత్తేమీ కాదు.

**ధిక్కారంతో మొదలైన ప్రస్థానం :** కొండా మురళి ఏ రాజకీయ నాయకుడికి వారసుడు కాదు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరిలో ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా మొదలై గ్రామ సర్పంచ్ గా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ లో చేరి తన స్వశక్తి, పట్టుదల, ప్రజాబలంతో నాయకుడిగా ఎదిగారు. 90వ దశకంలో వరంగల్ లో రెడ్డి, వెలమ దొరల పెత్తనం నడుస్తున్న రోజుల్లో, ఒక బీసీ బిడ్డగా నిలబడి "ఇది నా గడ్డ" అని ప్రకటించడమే ఆయనలోని ధిక్కారం.

ఆ ధిక్కారానికి తోడుగా వచ్చిందే కొండా సురేఖ. కాలేజీ రోజుల్లోనే కొండా మురళిని ప్రేమ వివాహం చేసుకొని, భర్త అడుగుజాడల్లో నడుస్తూ 1995లో గీసుకొండ ఎంపీపీగా గెలిచారు. 1999లో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రోత్సాహంతో శాయంపేట నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి, అసెంబ్లీలో భయం లేకుండా అనర్గళంగా మాట్లాడే నాయకురాలిగా గుర్తింపు పొందారు.

**4 పార్టీలు – ఒకే తత్వం :** వీరి రాజకీయ ప్రయాణం 4 పార్టీలతో ముడిపడి ఉంది. తరచూ పార్టీలు మారుతారని చాలామంది విమర్శిస్తారు, కానీ వారు పార్టీలను మారడం కంటే పార్టీలే వారిని భరించలేకపోయాయని చెప్పవచ్చు.

తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించినప్పటికీ, ఎర్రబెల్లి దయాకర్ రావుతో ఆధిపత్య పోరులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్ మరణం తర్వాత ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిలతో పొసగక వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనతి కాలంలోనే జగన్ తో విభేదించి టీఆర్ఎస్ పార్టీలో చేరి వరంగల్ తూర్పు నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

టీఆర్ఎస్ లో ఉన్నప్పుడు కూడా కేసీఆర్ కు సైతం షరతులు పెట్టారు. తాము పెట్టిన షరతులు అమలు చేయలేదని కేసీఆర్ ను విమర్శిస్తూ నాలుగేళ్లు తిరిగేసరికి టీఆర్ఎస్ కు దూరమయ్యారు. దళితులను, మహిళలను, బలహీన వర్గాలను అణచివేస్తున్నారని మండిపడ్డారు. తిరిగి కాంగ్రెస్ గూటికి చేరినప్పుడు కూడా షరతులతోనే వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని వారి కూతురు సుస్మితా పటేల్ తీవ్ర విమర్శలు చేయడం, ఎక్కడున్నా తలవంచని తత్వాన్ని చాటుతుంది.

**అధికారంలో ఉన్నప్పుడే ప్రభుత్వ తీరుపై ధర్నా :** 2005లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సొంత ప్రభుత్వంపైనే ధర్నా చేపట్టి పొన్నాల లక్ష్మయ్య లాంటి ఉద్దండుడినే ఢీకొన్నారు. తమ అనుచరుడు దుగ్గొండి మండలం నాచినపెల్లి ఎంపీటీసీ నల్లగొండ రమేష్ ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, తమను రాజకీయంగా అణచివేస్తున్నారని ఆరోపించారు. ఈ పంచాయతీ నాటి సీఎం వైఎస్సార్ వరకు వెళ్లడంతో ఆయన జోక్యంతో సద్దుమణిగింది. కానీ కొండా దంపతుల పట్ల నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎంత వరకైనా తెగిస్తారు అనే విశ్వాసం వ్యక్తమైంది.

**దొంతిపై తిరుగుబాటు :** 2005లో వరంగల్ డీసీసీబీ చైర్మన్ గా కొండా మురళి ఎన్నిక కావడంతో అంతకుముందు చైర్మన్ గా పనిచేసిన దొంతి మాధవరెడ్డితో విభేదాలు తలెత్తాయి. 2006లో స్థానిక సంస్థల ఎన్నికల్లో గూడూరు మండలం నుండి కొండా దంపతుల అనుచరుడు, పీసీసీ కో–ఆప్షన్ మెంబర్ అయిన కంచె ఐలయ్య జడ్పీటీసీగా పోటీ చేయాలని ఆశించాడు. నర్సంపేట ఇన్చార్జి అయిన దొంతి మాధవరెడ్డి టికెట్ రాకుండా అడ్డుపడగా, కంచె ఐలయ్య ఇండిపెండెంట్ గా నిలబడి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వరంగల్ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది.

**అధిష్టానంపై అసమ్మతి – ఎమ్మెల్సీగా ఎన్నిక :** 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో శాయంపేట నియోజకవర్గం రద్దయింది. అప్పటివరకు అక్కడి నుండి ప్రాతినిధ్యం వహించిన కొండా సురేఖ, కొత్తగా ఏర్పాటైన భూపాలపల్లి నుండి తాను, తన భర్త మురళి పరకాల నుండి పోటీ చేయాలని డిమాండ్ చేశారు. అయితే డీసీసీ అధ్యక్షుడు గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లి టికెట్ ఆశించడంతో వివాదం తలెత్తింది. కొండా దంపతులు అధిష్టానంపై అసమ్మతి వ్యక్తం చేయడంతో వైఎస్సార్ కలుగజేసుకొని, గండ్రకు భూపాలపల్లి టికెట్ కేటాయించి, ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి, కొండా మురళికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు.

**ఎస్టీ మహిళా జడ్పీ చైర్మన్ పై అవమానం అపవాదు :** 2006లో వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీ మహిళలకు రిజర్వు కావడంతో మంత్రి పొన్నాల లక్ష్మయ్య అనుచరుడి సతీమణి లకావత్ ధన్వంతికి అవకాశం దక్కింది. పొన్నాలతో ఉన్న విభేదాల కారణంగా నాటి శాయంపేట పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు కొండా దంపతుల ఆదేశాల మేరకు ఆమెను గదిలో బంధించి అవమానించారనే ఆరోపణలు వచ్చాయి. బలహీన వర్గాల నాయకులుగా చెప్పుకుంటున్న కొండా దంపతులు గిరిజన మహిళ పట్ల అలా ప్రవర్తించారనే అపవాదును మూటగట్టుకున్నారు.

**మానుకోట కాల్పులు – తెలంగాణ ఉద్యమంలో మాయని మచ్చ :** మలిదశ తెలంగాణ ఉద్యమ కాలంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో మహబూబాబాద్ పర్యటనకు రాగా, తెలంగాణపై వైఖరి చెప్పాలని ఉద్యమకారులు అడ్డుకున్నారు. ఆ సందర్భంగా జరిగిన కాల్పుల్లో పదుల సంఖ్యలో ఉద్యమకారులు గాయపడ్డారు. ఈ ఘటనతో తీవ్ర ఒత్తిడికి గురైన కొండా సురేఖ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం సృష్టించింది. 2012లో తెలంగాణ కోసం రాజీనామా చేసినా, అది జగన్ కోసమే చేశారని తెలంగాణ జేఏసీ, టీఆర్ఎస్ ప్రకటించి పరకాల ఉప ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టడంతో ఆమె స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఉద్యమకారులపై కాల్పుల వెనుక కొండా దంపతుల హస్తం ఉందనే ప్రచారం వారి కెరీర్‌లో మాయని మచ్చగా మిగిలిపోయింది.

**ధిక్కారమే ఆయుధం, అభిమానమే కవచం :** కొండా మురళిపై హత్య, హత్యాయత్నం కేసులు, భూ కబ్జా ఆరోపణలు ఎన్ని ఉన్నా ఏదీ వారిని తాకలేదు. ఎందుకంటే వరంగల్ పేదవాడికి ఒక నమ్మకం ఉంది – "పోలీస్ స్టేషన్ లో పని కాకపోతే, కొండా ఇంటికి పోతే పని అయిపోతుంది." ఈ నమ్మకమే వారికి వేలమంది అనుచరులను సంపాదించిపెట్టింది. సురేఖ విషయంలో ఆమె మహిళాలోకానికి ఒక ధైర్యం. భర్త జైల్లో ఉన్నప్పుడు, రాజకీయంగా ఒంటరైనప్పుడు కూడా పరకాల, శాయంపేట గ్రామాల్లో తిరుగుతూ ప్రజల్లో ఉండటం ఆమెలోని పోరాట పటిమకు నిదర్శనం.

**ముగింపు కాదు, మరో ప్రారంభం :** జరిగిన పరిణామాలతో కొండా సురేఖ తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గం నుండి బర్తరఫ్ కు గురి కావడం వల్ల వారి రాజకీయ అన్యాయానికి ముగింపు కాదు. మరో ఆరంభానికి శ్రీకారం అవుతుంది. బీసి సామాజిక వర్గానికి చెందిన మహిళ నేతగా ఉన్న కొండా సురేఖను మంత్రి వర్గం నుండి తొలగించడంతో ప్రజల్లో కొండా దంపతుల పట్ల సానుభూతి పెరుగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వారికి అండగా ఉన్నారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, కేసులు, గెలుపోటములు చవి చూసినా వారి కళ్ళలో ఇంకా ఆ ధిక్కారం అలాగే ఉంది. వరంగల్ జిల్లా రాజకీయా ల్లోకి చాలామంది వచ్చారు, పోయారు. కానీ కొండా దంపతులు మాత్రం ఒక ప్రశ్నలా, ఒక సమాధానంలా మిగిలిపోయారు. ఎందుకంటే వారిది పదవుల కోసం చేసే రాజకీయం కాదు, పట్టు కోసం చేసే యుద్ధం. ఆ యుద్ధంలో రాజీ లేదు, ఆ యుద్ధం ఆది నుంచి ధిక్కారమే.



మాదాసి సురేష్
రాజకీయ విశ్లేషకులు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**రాయపర్తి సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం 'కాట్రపల్లి గ్రామానికి చెందినబీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు బోనగిరి ఉప్పలయ్య కూతురు మహాలక్ష్మి (లావణ్య) – సుధీర్ వివాహం వావిలాల ఫంక్షన్ హాల్లో జరుగగా ఈ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించిన రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జిఎర్రబెల్లి దయాకర్ రావుమరియు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి.మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన..

**- అంబేద్కర్ సెంటర్‌లో వంటావార్పు.. - రోడ్డుపైనే మహిళలతో భోజనం చేసిన చల్లా.. - చల్లా ధర్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే..**







**పరకాల, సెప్టెంబర్ 4 ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాల అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రోడ్డుపైనే పొయ్యిలు వెలిగించి వంటలు చేసి మహిళలతో కలిసి మాజీ ఎమ్మెల్యే భోజనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా ప్రజలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద ఇస్తామన్న తులం బంగారం ఎక్కడుందని ప్రశ్నించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని గొప్పలు చెప్పుకుంటూ.. మరోవైపు పురుషులపై చార్జీల భారం పెంచి కుటుంబాల్లోనే పంచాయతీలు పెట్టే పరిస్థితి తీసుకొచ్చారని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. మహిళల రక్షణకు పటిష్టమైన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఆ హామీని కూడా పట్టించుకోవడం లేదన్నారు. మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తామని చెప్పి ఆ హామీని పక్కన పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళా సంఘాలకు నిర్మించిన భవనాలే నేటికీ కనిపిస్తున్నాయని, మహిళా సంఘాల సభ్యులను అడిగితే ఎవరు వారి కోసం పనిచేశారో చెబుతారని అన్నారు. మహిళా కమిషన్‌ను బలోపేతం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కమీషన్ల వసూళ్లకే ప్రాధాన్యత ఇస్తోందని చల్లా ధర్మారెడ్డి ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ కిట్‌ను మాయం చేసి గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన భరోసాను దూరం చేశారని, మహిళలకు రూ. 2,500 ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వృద్ధులకు కేసీఆర్ ప్రభుత్వం అందించిన పెన్షన్లే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేముందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తుచేస్తూ.. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి - ఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 4 :** శుక్రవారం రోజున భూపాలపల్లి నియోజకవర్గం లోని గణపురం, భూపాలపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనా రాయణ రావు పంపిణీ చేశారు. గణపురం మండ లంలో 29 మంది లబ్ధిదారులకు 7,13,600/- మరియు భూపాలపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు 7,03500/- లా విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందజేస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సాయం అవసరమైన వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కాషాయం వైపు యువత

## 30వ వార్డ్ నుండి బిజెపిలోకి చేరికలు

**- డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



**నర్సంపేట సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి) :** పట్టణంలో బీజేపీ బలం రోజురోజుకు పెరుగుతోంది. నర్సంపేట పట్టణంలో జూలూరి మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ అధ్యక్షతన జరిగిన చేరికల కార్యక్రమంలో నర్సంపేట పట్టణ 30వ వార్డుకు చెందిన కాంగ్రెస్,బి ఆర్ ఎస్ పార్టీలకు చెందిన యువ నాయకులు గుంటి అరవింద్,ఎస్ కే అజీమ్ పాషా, కాగితాల అనిల్,మర్రిపల్లి రవి (చిన్న బబ్బులు), కాసుల గణేష్, వల్లభ్ నగర్ ప్రాంతానికి చెందిన రాకేష్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి యువ నాయకులకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డా. రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూనర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీలకు కాలం చెల్లిందని, ఆ రెండు పార్టీల పునాదులు కదులుతున్నాయని అన్నారు. వారి కార్యకర్తల అడుగులన్నీ ఇప్పుడు భారతీయ జనతా పార్టీ వైపే పడుతున్నాయని అన్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి రహిత, అభివృద్ధి పాలనకు, జాతీయవాదానికి ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని, రాష్ట్రంలో బి ఆర్ ఎస్ చేసిన 10 ఏళ్ల అరాచక, కుటుంబ, దోపిడీ పాలన,ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత ఆరు గ్యారంటీల డ్రామాతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని మండిపడ్డారు. నర్సంపేటలో మనం చేస్తున్న నిరంతర ప్రజా పోరాటాలు, ప్రజా సేవా కార్యక్రమాలకు ప్రజల నుండి అపూర్వ స్పందన వస్తోందని, రాబోయే రోజుల్లో నర్సంపేట గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, పదవులు ఇచ్చి కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు విగ్నేష్,నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు,ఠాగూర్ విజయ్ సింగ్,ముత్యాల శ్రీనివాస్, శామాల ప్రవీణ్,బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు చిలువేరు అన్వేష్,పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## నేడు ములుగు బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కరిస్టుల నిరసన

**డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అమరా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలకు నిరసన**



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై అమరా ప్రసాద్ అనే వ్యక్తి చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం ఉదయం 11 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జన్ను రవి మాదిగ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మధ్య కాలంలో అమరా ప్రసాద్ అనే వ్యక్తి తాను దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాయలేదని, అతని చరిత్ర కల్పిత గాథ అని,మను వాదపు మతం ముసుగులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమాన పరుస్తున్న అమరా ప్రసాద్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అతన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపాలని కోరారు. ఈ నిరసనలో జిల్లాలోని దళిత గిరిజన బహుజన అనగారిన వర్గాల ప్రజలు ప్రజాస్వామ్య వాదులు అంబేద్కరిస్టులు, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ, ఉద్యోగ సంఘాలు రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న అంబేద్కరిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు






**మంగపేట సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా ఆలయంలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామివారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఇళ్లల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలతో అలరించారు. అనంతరం మల్లూరు గ్రామానికి చెందిన యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్టి కొట్టే ఘట్టాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి, మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, మాజీ చైర్మన్ సమ్మయ్య, కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 1000 రోజుల ప్రజా పాలన పూర్తి

**కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4 ప్రజాజ్యోతి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 45వ డివిజన్ మడికొండ జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్ర హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కర్ర హరీష్ రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు లేవనెత్తాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేత



**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి, సెప్టెంబర్ 4 :** అసెంబ్లీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలను లేవనెత్తాలి భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎస్ వెంకట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్ కిషోర్ శుక్రవారం రోజున ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల గురించి అసెంబ్లీలో చర్చించాలని తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ భూపాలపల్లి జిల్లా నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ భూపాలపల్లి జిల్లా నాయకులు ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం సమర్పించారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా కానీ ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా జీతాలు ఇవ్వాలని కోరారు.. వైద్యశాఖలో పనిచేసే ఉద్యోగులకు ఔట్సోర్సింగ్ ఏజెన్సీలు అన్యాయం చేస్తున్నాయన్నారు.. వచ్చేవారం హైదరాబాదులో జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ కోరారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహా గద్దె తొలగింపు దారుణం

**కొడారి రవి నర్సంపేట మాజీ సర్పంచుల ఫోరంఅధ్యక్షుడు**



**నర్సంపేట సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే,ప్రజా నాయకుడు, నర్సంపేట అభివృద్ధి ప్రదాత దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం ఖానాపురం మండలం అశోక్ నగర్ లో నిర్మించిన గద్దెను తొలగించడం తీవ్రంగాఖండిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో చురుకుగా పాల్గొని,నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి తనదైన ముద్ర వేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు. ఆయన ఆకస్మిక మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న అభిమానులు, కార్యకర్తలు,ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, అధికారులకు ఉంది. ఖానాపురం మండలం అశోక్ నగర్ లో ఒక ప్రజా నాయకుడి జ్ఞాపకార్థం ఏర్పాటు చేయాలనుకున్న విగ్రహానికి సంబంధించిన నిర్మాణాన్ని తొలగించడం ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసే చర్యగా భావిస్తున్నాం. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఏవైనా అనుమతులు,నిబంధనలకు సంబంధించిన అంశాలు ఉంటే వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించాలి. తొలగింపు చర్యల ద్వారా ఉద్రిక్తతలకు దారితీయడం సరికాదు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అధికారిక అనుమతులతో,అన్ని నిబంధనలను పాటిస్తూ గౌరవప్రదమైన ప్రదేశంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు,పార్టీ శ్రేణులు, నర్సంపేట ప్రజల మనోభావాలను ప్రభుత్వం గౌరవించాలి. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించవచ్చు కానీ ఆయన ప్రజల గుండెల్లో నిలిచిన జ్ఞాపకాలను మాత్రం తొలగించలేరు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి, విగ్రహాల ఏర్పాటుకు అనుకూలమైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నాం

## గ్రంధాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలి

- విపంచి ఫౌండేషన్ చైర్మన్ ఎనుముల శ్రీనివాస్
- బాలాజీ నగర్ తండా గ్రంధాలయానికి 500 బుక్స్ అందజేత



**దామరచర్ల , సెప్టెంబర్ 04, (ప్రజాజ్యోతి) :** గ్రంధాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని విపంచి ఫౌండేషన్ చైర్మన్ ఎనుముల శ్రీనివాస్ అన్నారు. దామరచర్ల మండలం లోని బాలాజీ నగర్ తండ గ్రామ పంచాయతీకి చౌటుప్పల్ కు చెందిన విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 పుస్తకాలను అందజేశారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఆయన బాలాజీ నగర్ తండ సర్పంచ్ వాంకుడోతు రాధరమణకు పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని, యువత పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, విజ్ఞానం పెంపొందించు కోవచ్చని పేర్కొన్నారు. గ్రామానికి పుస్తకాలను అందించిన విపంచి ఫౌండేషన్ చైర్మన్ కి గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు భూక్యా సైదా, భూక్య వెంకటేశ్వర్లుతదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి



**కేతపల్లి, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి :** కేతపల్లి మండలం కొర్లపాడు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సూరారపు వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ వెంకన్న మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్‌రెడ్డి, కొర్లపాడు మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు భయ్యా అంజయ్య యాదవ్, ఇప్పలగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు సైదులు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండ బుర్రయ్య, భద్రయ్య, అంజిబాబు, ప్రశాంత్, లింగరాజు, బబ్లు, ఆవుదొడ్డి లింగయ్య, ఎడ్ల శీను, మహేష్, ప్రవీణ్, సూరారపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జన్మాష్టమి సంబరాలు

- రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి) :** పోచంపల్లి పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. బాలకృష్ణుడి బాల్యలీలలను ప్రదర్శిస్తూ నృత్యాలు, భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.



ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కళావతి మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి బోధనలు, సత్యం, ధర్మం, ప్రేమ, మంచితనం వంటి విలువలను విద్యార్థులు జీవితంలో పాటించాలని సూచించారు. అనంతరం విధ్యార్థులకు ప్రసాదం పంపిణీ చేశారు. వేడుకలు భక్తి శ్రద్ధలతో ఆనందోత్సహాల మధ్య ముగిశాయి. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ చెరుకు లింగస్వామి, ప్రదానోపాధ్యాయులు కళావతి, ఉపాధ్యాయ బృందం ఉమ, కుసుమాంజలి, స్పంధన, స్వప్న, శృతి, మేఘమాల, సంతోష, పావని అంజలి, ఐశ్వర్య, కీర్తన, సంధ్యారాణి, ఉమ్య. శిల్ప, దీపన, ఏ. లావ్య . కె.లావణ్య మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కన్న కొడుకును కోల్పోయిన స్నేహితుడికి..

## కన్నీటి కష్టంలో తోడుగా నిలిచిన మిత్రులు

- రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన స్నేహితులు



**తుంగతుర్తి, సెప్టెంబర్ 4, (ప్రజా జ్యోతి) :** ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో తమను మంచిగా చూసుకుంటాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు విధి తీరని విషాదాన్ని మిగిల్చింది. కన్న కొడుకు రోడ్డు ప్రమాదంలో అకాల మరణంతో కన్నీరు మున్నీరవుతున్న స్నేహితుడి కుటుంబానికి చిన్ననాడు తనతో కలిసి చదువుకున్న తోటి స్నేహితులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని దేవునిగుట్ట తండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుగులోతు తేజ స్వాతి కుమారుడు భరత్ మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోగ, గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

స్నేహితుడి కుటుంబం ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కన్న కొడుకును కోల్పోయి పడుతున్న బాధను చూసి చలించిన తేజ స్నేహితులు భరత్ కుటుంబానికి అండగా నిలిచారు. తమ స్నేహ బంధానికి గుర్తుగా, కష్టకాలంలో స్నేహితుడికి తోడుగా నిలవాలనే ఉద్దేశంతో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రుల బాధను ఏ సహాయంతోనూ తీర్చలేమని, అయితే ఈ కష్ట సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడం తమ కనీస బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భరత్ అకాల మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. స్నేహితుడి కుటుంబం విషాదంలో ఉన్న సమయంలో తమ వంతు సాయం అందించిన చిన్ననాటి మిత్రులను గ్రామస్తులు అభినందించారు. సంతోషంలో కలిసి ఉండేవారు చాలామంది ఉంటారు.. కానీ కన్నీటి సమయంలో భుజం తట్టి నిలబడేవారే నిజమైన స్నేహితులని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ఈ మిత్రుల సహృదయత పలువురికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తేజ స్నేహితులు పులు గుజ్జ యాకయ్య, చిర్ర దామోదర్, కటికిరెడ్డి సుధీర్, పసుపులేటి అంజయ్య, చేపూరి శ్రీను, తునికి కాసిం, దికొండ ఎల్లయ్య, గుండా శ్రీను, జక్కుల కొమరయ్య, మల్లయ్య, రమేష్, నాగయ్య, గౌడ్ చర్ల శ్రీను, తదితర స్నేహితులతో పాటు దేవునిగుట్ట తండా సర్పంచ్ స్వాతి భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కాలు తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమంటూ... వంటా వార్పుతో బీఆర్ఎస్ నిరసన





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 04, (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం మిర్యాలగూడ లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటి రెడ్డి హాజరై ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి, ఇచ్చిన హామీలు నెరవేర్చాలి, ప్రజలకు న్యాయం చేయాలంటూ నినాదాలతో సాగర్ రోడ్డు లోహోరెత్తించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ప్రభుత్వంపై ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి. యూసుఫ్, పెండ్యాల పద్మావతి, కుర్ర చైతన్య, షహనాజ్ బేగం, ధూళిపాల కళావతి, కోదాటి రమ, పెరుమాళ్ళ ధనమ్మ, చిత్రం ఉమా, గడ్డం దీపిక, గుడిసె జానకమ్మ, లావూరి అరుణ, సందేశ్ రజిని, జనపాల సునీత, పద్మశెట్టి లక్ష్మి, తీరంశెట్టి సీత, రేబిల్లి శ్రీజ, నూనె మమత, బంటు కాత్యాయని, నక్క సంధ్య, బల్లెం దేవకమ్మ, కమటాల స్వరూప, ఎండి. ఇలియాస్ ఖాన్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## అంతా మా ఇష్టం అంటున్న కొందరు సర్పంచులు

- ఇందులో కార్యదర్శుల పాత్ర లేకపోలేదు?
- ప్రజలను పట్టి పీడీస్తారు? దళారులకు కొమ్ముకాస్తారు?




**చింతపల్లి సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి) :** చింతపల్లి మండలంలోని కొందరి సర్పచుల, పంచాయతీ కార్యదర్శుల వ్యవహారం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. అయితే కార్యదర్శుల విధి నిర్వహణ మర్చి నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారానే విమర్శలు లేలపోలేదు .అనుమతులు ప్రజాలకేనా? ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పరిశ్రమకు అవసరం లేదా అంటూ ప్రజలు దుయ్యబట్టారు. గ్రామాల్లో ప్రజలు గూడు, గుడిసె కట్టాలన్న గ్రామపంచాయతీ అనుమతి తప్పని అంటూ వందల రూల్స్ చెప్పి నానా ఇబ్బందులు గురి చేసి పనులు అడ్డుకుంటారు. అలాంటి కార్యదర్శులు కొన్ని గ్రామాల్లో వందల ఎకరాల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తుంటే ఏమి తెలవనట్లు ఇప్పటివరకు మా దృష్టికి రాలేదంటూ సులువుగా తప్పించుకుంటున్నారు. పేద ప్రజలమీద ఉన్న శ్రద్ధ అనుమతి లేకుండా పరిశ్రమలు నిర్వహిస్తున్న దళారులమీద లేదా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలు వల్లన పర్యావరణనికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మైనింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పంచాయతీ రాజ్, అటవీ మరియు విద్యుత్ శాఖల నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే వీటిని నిర్వహిస్తున్నారు. నివవస ప్రాంతాలకు కనీసం 5 కిలోమీటర్ల దూరంలో ఉండాలనే నిబంధనలను భేకారత్ చేస్తూ జనవాసాల కొద్దీ దూరంలో నిర్వహిస్తున్న అధికారులకు మాత్రం మామూళ్లు ముడితే చాలు అన్నట్లుగా వ్యవరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గ్రామాల్లో ఇటుకబట్టీలు నిర్వహించాలంటే గ్రామపంచాయతీ, రెవెన్యూ, భూగర్భ శాఖల నుండి అనుతి తప్పని సరిగా పొందాలి. అనుమతి లేనటువంటి బట్టీలను అక్రమ ఇటుక బట్టిలుగా పరిగణిస్తారు. అక్రమ ఇటుక బట్టీలపై సర్పంచులు మౌనం పాటిస్తే, కార్యదర్శులు వినికిడి లేనట్లుగా వ్యవరిస్తున్నారు...

**అక్రమ ఇటుకబట్టీలపై మరింత సమాచారం మరో కథనంలో**

## అబద్దాలు అందంగా చెప్పడంలో కేటీఆర్ దిట్ట...!





- కళ్ళుండి చూడలేని కబోదులు బి ఆర్ ఎస్ నాయకులు
- తాము నెరవేర్చిన హామీలలెక్కలు పక్కా
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్
- ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమా..! అంటూ సవాల్

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 04, (ప్రజాజ్యోతి) :** అబద్ధాలు అందంగా చెప్పడంలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిట్ట అని, కళ్ళ ముందు నీళ్లు పారుతుంటే కళ్ళుండీ చూడలేని కబోదులు టిఆర్ఎస్ నాయకులని మండిపడ్డారు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ రైతు మహాధర్నాలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ప్రజాస్వామ్య పద్ధతికి విరుద్ధంగా నిరాధారమైన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను లెక్కలతో సహా అమలు చేశామని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని స్పష్టంచేశారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 25,703 మంది రైతులకు రూ. 197 కోట్ల మేర రుణమాఫీ లబ్ధి జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 2,005 కోట్ల మేర రైతుల రుణాలు మాఫీ చేశామన్నారు. రుణమాఫీ పై సందేహాలుంటే మిర్యాలగూడ రాజీవ్ గాంధీ సెంటర్ లేదా నల్గొండ క్లాక్ టవర్ వద్ద చర్చకు సిద్ధమా అంటూ బి ఆర్ ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. ఖరీఫ్, రబీ సీజన్ల ధాన్యానికి క్రమం తప్పకుండా బోనస్ ఇస్తున్నామన్నారు.

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన మెట్టసాగు చేయాలని రైతులకు సూచించామన్నారు.

పైన కురిసిన వర్షాలతో జలాశయాలలో కొంతమేరకు చేరిన వరద నీటిని రైతుల సంక్షేమం కోసం పంటలు ఎండిపోకుండా ముందే కాలువలకు నీటిని విడుదల చేసి రైతులను కాపాడుతున్నామన్నారు.?నాగార్జునసాగర్ కాలువల ద్వారా 9,000 క్యూసెక్కుల నీటిని చివరి పైరు వరకు అందిస్తున్నాం అన్నారు.?రూ. 1000 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు.

?నక్కలగండి, పాలమూరు-రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేశామన్నారు.?ఉచిత బస్సు ప్రయాణం, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సేవలు సజావుగా అందుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు, సబ్సిడీపై గ్యాస్, నూతన రేషన్ కార్డులు, దేశంలోనే ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలతో అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం దూసుకుపోతుందన్నారు.?

గతంలో నిలిచిపోయిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్, నీటి వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. పదేళ్లపాటు సుభిక్షంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుతిని, అభివృద్ధిని కేవలం కాగితాలకే పరిమితం చేసిన బిఆర్ఎస్ నాయకులకు, మూడేళ్లలోనే అన్ని హామీలను నెరవేర్చి అభివృద్ధి వైపు దూసుకుపోతున్న కాంగ్రెస్ పాలనను ఓర్చుకోలేక అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అనేక అవినీతి అక్రమ కేసుల్లో కూరుకుపోయిన బిఆర్ఎస్ మాజీలు తమ ఉనికిని చాటుకునేందుకు కాంగ్రెస్ నాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ అవాక్కులు, చవాక్కులు పేలుతున్నారని ఆగ్రహించారు. అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్ఆర్ ను విమర్శించే స్థాయి అవినీతి బిఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, కొమ్ము దాసు, కొండ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మాలోతు జనార్ధన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ రైలు దీక్షకు క్రైస్తవ సంఘాల మద్దతు

- మొదట ప్రకటించిన అలైన్‌మెంట్ ప్రకారమే రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలి - బిషప్ దుర్గం ప్రభాకర్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి) :** సూర్యాపేట జిల్లా మీదుగా బుల్లెట్ రైలు, రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట పట్టణంలోని బతుకమ్మ చౌరస్తా వద్ద డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. శుక్రవారం ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బిషప్ దుర్గం ప్రభాకర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 1853లో రైల్వే వ్యవస్థ ప్రారంభమైందని, స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశంలో 42 రైల్వే సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. 1951లో వాటన్నింటినీ ఏకీకృతం చేసి భారతీయ రైల్వే వ్యవస్థగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో రైల్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఇప్పటికీ రైల్వే మార్గం లేకపోవడం దురదృష్టకరమని బిషప్ దుర్గం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలు రైలు ప్రయాణం కోసం నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, జనగామ, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం లేకపోవడం ప్రజాప్రతినిధుల వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. బుల్లెట్ రైలు కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు రోజురోజుకూ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు పెరుగుతోందని తెలిపారు. రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేలా తొలుత ప్రకటించిన అలైన్‌మెంట్‌ను మార్చి కొండమల్లేపల్లి--హాలియా--సాగర్ మార్గం వైపు మళ్లించడం అన్యాయమని అన్నారు. మొదట ప్రకటించిన అలైన్‌మెంట్ ప్రకారమే హైదరాబాద్--చౌటుప్పల్--చిట్యాల--నార్కట్‌పల్లి--నకిరేకల్--సూర్యాపేట--కోదాడ మీదుగా విజయవాడ, చెన్నై వైపు బుల్లెట్ రైలు నడపాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు, రైల్వే కారిడార్ ఏర్పాటైతే ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, వ్యాపార, వాణిజ్య రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జిల్లా ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శ్యామ్ ప్రసాద్, ముల్లంగి జాకబ్ రాజు, జలగం జేమ్స్, చింత మనిషే, పి. మార్క్, కొండేటి లాజర్, ఎం. రూబెన్, పంది మార్క్, కొమ్ము హోసన్నా, మామిడి క్రిస్టోఫర్, పిట్టల సామేలు, రెంటాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హామీలతో గెలిచి.. దివ్యాంగులపై నిర్లక్ష్యమా?

- రూ.6 వేల పింఛన్ ఇస్తామని మాట తప్పారు.. బ్యాక్‌లాగ్ పోస్టుల హామీని విస్మరించారు
- కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తాం: మాజీ ఎమ్మెల్యే
- బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగులకు రూ.10,300 కోట్లు అందించాం: మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్‌కుమార్





**తుంగతుర్తి (తిరుమలగిరి), సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి) :** ఎన్నికల వేళ హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం... అధికారంలోకి వచ్చిన తర్వాత సబండ వర్గాలను మోసం చేస్తూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విఫలమైందని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ధ్వజమెత్తారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలగిరి మండల కేంద్రంలో దివ్యాంగులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు దివ్యాంగులకు రూ.6 వేల పించన్ ఇస్తామని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందని ఆయన ఆరోపించారు. వృద్ధులకు, మహిళలకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేశామని కిశోర్ కుమార్ పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.10,300 కోట్ల మేర నిధులు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కు దక్కుతుందని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అట్టడుగు వర్గాలకు అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకుందని తెలిపారు. ప్రతి మహిళకు రూ.2,500 మహాలక్ష్మి పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. వృద్ధులకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో సబ్బండ వర్గాలకు అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కిశోర్ కుమార్ తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. హామీలను అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం తో తలెత్తుకుని పాలన సాగించారని అన్నారు. తెలంగాణ ప్రజలే తమకు బాసులని కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు.

తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల విషయంలో ప్రభుత్వం సరైన వైఖరి అవలంబించడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోరాటానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని కిశోర్ కుమార్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు, నేవూరి ధర్మేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట

★ గంగారం తండాలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

**ఇందల్వాయి:** మండల కేంద్రంలోని తీర్మానపల్లి సబ్ సెంటర్ పరిధిలోని గంగారం తండాలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్వైజర్ సమాధానం.ఏఎన్ఎం నిర్మల రాణి, ఆశా వర్కర్ జ్యోతి ఆధ్వర్యంలో తండాలోని ప్రతి ఇంటినీ సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంటి చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకోవాలని, ఇంటి ముందు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా





జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి యజమానులకు సూచించారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, ఇతర జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని సూపర్వైజర్ సమాధానం.తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. దోమల నివారణకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నిర్మల రాణి, ఆశా వర్కర్ జ్యోతి పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

## మండలంలోని వార్డు సభ్యుల కమిటీ సమావేశం

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల వార్డ్ మెంబర్స్ పోరం కమిటీ మద్దికుంట, జగదాంబ తండా మరియు వివిధ గ్రామాల ను పర్యటించి, వార్డ్ సభ్యుల సమస్యలను, వారి హక్కులను గురించి చర్చించి మరియు గౌరవ వేతలనల గురించి మాట్లాడటం జరిగింది. రామారెడ్డి మండల వార్డు సభ్యుల అధ్యక్షుడు చేన్నంశెట్టి ప్రశాంత్,ఉపాధ్యక్షుడు కరికే సత్యరాజ్,ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ శేఖర్, సలహాదారులు రెడ్డి మల్లేష్,వార్డు సభ్యులు హరీష్,



మరియు ఆయా గ్రామాల వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.ఆయా గ్రామాల వార్డు సభ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## చిన్ని కన్నయ్య అడుగులతో ఆనందాల వెల్లువ

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి)** కృష్ణాష్టమి సందర్భంగా చిన్ని కన్నయ్య ముద్దు ముద్దు అడుగులేస్తూ, అంబాడుతూ ఇంటిల్లి పాదిని ఆనందంతో నింపుతున్నాడు. ఆ బుడిబుడి అడుగుల్లో అమాయకత్వం, ఆ చిరునవ్వులో దివ్యమైన కృష్ణ తేజస్సు కనిపిస్తున్నాయి. చిన్నారి కృష్ణుడి రూపంలో ప్రతి హృదయం భక్తి భావంతో పరవశిస్తోంది. వెన్నముద్దలా ముద్దొచ్చే ఆ రూపం అందరి



మనసులను దోచుకుంటోంది. వేణుగానంలా మధురమైన నవ్వులతో, అల్లరి చేష్టలతో అందరికీ అపారమైన సంతోషాన్ని పంచుతున్నాడు. ఇలాంటి పవిత్రమైన కృష్ణాష్టమి రోజున శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రతి కుటుంబం పై కురవాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం, శాంతి, సౌభాగ్యాలు నిండాలని మనస్పూర్తిగా కోరుకుంటూ అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

## సొసైటీకి తాళం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

★ గన్నారం రైతులకే యూరియా ఇవ్వాలంటూ సొసైటీకి తాళం ★ ఇందల్వాయి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా

**ఇందల్వాయి:( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 4** ఇందల్వాయి సొసైటీ పరిధిలోని గన్నారం గ్రామంలో యూరియా పంపిణీ విషయంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి వచ్చిన యూరియా స్థానిక రైతులకు దక్కకుండా, ఆన్‌లైన్‌లో నమోదు కాక ఇతర గ్రామాలకు చెందిన రైతులకు బుకింగ్ అవుతోందని ఆరోపిస్తూ గన్నారం రైతులు ఆందోళనకు దిగారు. గన్నారం గ్రామానికి వచ్చిన యూరియాను గన్నారం గ్రామ రైతులకే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సొసైటీకి తాళం వేశారు. అనంతరం గన్నారం నుంచి ఇందల్వాయి వరకు పాదయాత్రగా తరలివచ్చిన రైతులు ఎమ్మార్వో







కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు "ఏవో డౌన్ డౌన్.. ఏవో డౌన్ డౌన్", "మా ఊరే మాకు కావాలి" అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. తమ గ్రామ రైతులకు యూరియా అందకుండా ఇతర ప్రాంతాల రైతులకు బుకింగ్ కావడంపై అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, కృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో ఎమ్మార్వో కార్యాలయానికి తాళం వేసి ఉండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాలయానికి వచ్చినప్పటికీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. యూరియా కోసం రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని, ఆన్‌లైన్ బుకింగ్ విధానంతో స్థానిక రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోయారు. తమ గ్రామానికి కేటాయించిన యూరియాను ఇతర ప్రాంతాల వారికి కాకుండా గన్నారం రైతులకే అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఆందోళనతో గన్నారం--ఇందల్వాయి ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## యూరియా కోసం తిప్పలు పట్టించుకోని నాయకులు

★ ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా.. ఏఓకు వినతిపత్రం

**ఇందల్వాయి:** మండల కేంద్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని, యూరియా యాప్ విధానం కారణంగా సామాన్య, పేద రైతులకు ఎరువు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పట్టించుకునే రాజకీయ నాయకులు ముందుకు రాకపోవడం బాధాకరమని వారు వాపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రైతులు పెద్ద సంఖ్యలో ఇందల్వాయి తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. "ఏఓ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ ఓట్లతో గెలిచిన రాజకీయ నాయకులు రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని రైతులు మండిపడ్డారు. యూరియా పంపిణీ కోసం అమలు చేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే తొలగించాలని, యాప్ వల్ల పేద రైతులకు యూరియా అందుబాటులో లేకుండా పోతోందని రైతులు డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా యూరియాను అందుబాటులో ఉంచి, రైతులకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఏఓ శ్రీకాంత్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా ప్రతి గ్రామానికి, ఆయా గ్రామ





రైతులకు అవసరమైన మేరకు యూరియా అందేలా పై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులందరూ కలిసి ఏఓ శ్రీకాంత్‌కు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం (మెమోరాండం) అందజేశారు. యూరియా కొరత సమస్యను వెంటనే పరిష్కరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని వారు కోరారు.



## ఘనంగా రాకేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 4, ప్రజాజ్యోతి:** రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను నారాయణఖేడ్‌లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ స్వగృహంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివకాంత్ పటేల్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ స్వగృహంలో పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి కేక్ కట్ చేసి రాకేష్ షెట్కార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చరవాణి ద్వారా కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ మేటి పురంజన్, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, బీసీ సెల్ అధ్యక్షుడు సాయిలు పటేల్, నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జ్ఞాన్ రెడ్డి, మానూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, మాజీ మండల



అధ్యక్షులు తాహిర్ అలీ, మాణిక్ రావు పటేల్, సర్పంచులు సంగమేశ్ పటేల్, చెన్ను పటేల్, శ్రీశైలం, రమేశ్, మారుతి పటేల్, విఠల్ రెడ్డి, పండరి, శివరాజ్, సుభాష్ చంద్రబోస్, నగేశ్, మాజీ సర్పంచ్ గంగయ్యాస్వామి, పెద్ద శంకరంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాను గౌడ్, ఉపసర్పంచులు బస్వరాజ్, అనిల్, సాయి చరణ్, సాయి దిగ్వల్, దత్తు రెడ్డి, భూపాల్, విరేష్, కొండల్ రెడ్డి, మారుతి, సంజీవ్ పటేల్, అశోక్ రెడ్డి, జనార్ధన్, చందు పటేల్, నగేశ్, సురేశ్ నాయక్, జగన్, శేఖర్ రెడ్డి, ఏక్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల రాకపోకలకు కొత్త ఊపిరి

★ పలు గ్రామాలు, తండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

**అందోల్, సెప్టెంబర్ 4, (ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా రవాణా సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం లభించింది. గ్రామపంచాయతీ పాలకవర్గాల చొరవతో పలు గ్రామాలు, తండాలను కలుపుతూ ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. చౌటకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెం, పుల్కల్ మండలంలోని హన్మ్య నాయక్ తండా పరిధిలోని సంగ్య నాయక్ తండా, తావుర్య తండా, విట్టల్ నాయక్ తండా, లాల్‌సింగ్ నాయక్ తండా, లక్ష్మీసాగర్, ఉమ్లా తండా, కొండారెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల ప్రజలకు ఈ బస్సు సేవలు ప్రయోజనం చేకూర్చనున్నాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు, గ్రామీణ ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు చేరుకునేందుకు రవాణా సౌకర్యం కీలకంగా మారింది. ఈ సమస్యను గుర్తించిన గ్రామపంచాయతీ పాలకవర్గాలు ఆర్టీసీ అధికారులను కలిసి బస్సు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశాయి. స్పందించిన ఆర్టీసీ ప్రాంతీయ, డిపో అధికారులు బస్సు సౌకర్యాన్ని మంజూరు చేయడంతో గ్రామస్తుల కష్టాలు కొంతమేర తీరనున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం బొమ్మరెడ్డిగూడెంలో బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సు సేవలను బొమ్మరెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్, హన్మ్య నాయక్ తండా సర్పంచ్ కవిత సేనాపతి ప్రారంభించారు.





జోగిపేట--లక్ష్మీసాగర్- -బొమ్మరెడ్డిగూడెం- -సంగారెడ్డి, అలాగే సంగారెడ్డి- -చౌటకూర్--బొమ్మరెడ్డిగూడెం- -లక్ష్మీసాగర్- -జోగిపేట మార్గాల్లో ఉదయం, సాయంత్రం బస్సు రాకపోకలు సాగనున్నాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణ భారం, సమయం తగ్గడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజనీ గోపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు, విశ్రాంత వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గోవిందరావు, ఎక్సైజ్ గోపాల్, మాజీ సర్పంచ్‌లు మమత రఘునాయక్, శివరాం, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, జీవవైవిధ్య కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ ప్రజా పాలన 1000 రోజుల విజయోత్సాహ ర్యాలీ

★ మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ చంద్రశేఖర్

**జహీరాబాద్, సెప్టెంబర్ 04 ( ప్రజా జ్యోతి న్యూస్ )** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా,జహీరాబాద్ పట్టణంలోని శుభాష్ గంజ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి మొదలుకొని భారత రత్న డా॥బి.ఆర్.అంబెడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి అక్కడి నుండి కుమార్ హోటల్ మీదుగా కరెంట్ ఆఫీస్ వరకు మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం డా॥ఏ. చంద్రశేఖర్ ఈ భారీ ర్యాలీ లో పాల్గొని కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మరింత ఉత్సాహాన్ని అందించారు. అనంతరం డా॥ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ఈ భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ వెయ్యి 1000 రోజులలో రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు ఏ.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరా మహిళ శక్తి ద్వారా డ్వాక్రా మహిళ లకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ పంపు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు





చేస్తు వస్తున్నారు,ఇంకా రాబోయే రోజుల్లో కూడా రాష్ట్ర ప్రజలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సుపరిపాలనను ప్రతిబింబం చేలా ఈ ర్యాలీ ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు మహమ్మద్ యూనుస్, అశోక్ కుమార్, పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు హుగ్గేల్లి రాములు, సువర్ణ -మల్లన్న పాటిల్, ఉదయ్ శంకర్ పాటిల్, పవన్ రాథోడ్, పట్టణ అధ్యక్షులు ముజాఫ్ఫార్ హుస్సేన్, మాజీ పట్టణ అధ్యక్షులు కందేం.నర్సింలు, తాజా మాజీ మండల పట్టణ



అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా ముదిరాజ్ సమాజం

★ చదువు.. చైతన్యం.. నాయకత్వమే అభివృద్ధికి మార్గం ★ యువత భవిష్యత్‌పై దృష్టి సారించాలి: ఆగం పాండు ముదిరాజ్

**అందోలు, సెప్టెంబర్ 04, (ప్రజాజ్యోతి):** కాలం మారుతున్న కొద్దీ సమాజాలు కూడా తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు ఆగం పాండు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు సపాన్ దేవ్ అన్నారు. రాబోయే తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్య, సామాజిక చైతన్యం, నాయకత్వ లక్షణాలకు ముదిరాజ్ కుటుంబాలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందోలు మండలం నాదులాపూర్‌లో ముదిరాజ్ సామాజిక చైతన్య అధ్యక్షులు బానిస నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ పితామహులు కొరివి కృష్ణస్వామి 133వ జయంతి సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ గత తరాల కష్టాలు, పోరాటాలను గుర్తు చేసుకుంటూనే భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. పిల్లలకు ఉన్నత విద్య అందించడం ప్రతి కుటుంబం తొలి బాధ్యతగా తీసుకోవాలని, విద్య ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. యువత కేవలం ఒక రంగానికే పరిమితం కాకుండా విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, ప్రజాసేవ, రాజకీయాలు తదితర రంగాల్లో తమ ప్రతిభను





నిరూపించుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ అర్హత, సామర్థ్యం ఆధారంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ఐక్యత కీలకమని, ఒకరి విజయాన్ని మరొకరు ప్రోత్సహించే సంస్కృతి పెరగాలని నాయకులు అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లల చదువుకు సహకరించడం, యువతకు మార్గదర్శకత్వం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. కొరివి కృష్ణస్వామి జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ఆయన సేవలను నేటి తరానికి పరిచయం చేసే ప్రయత్నంగా చూడాలని అన్నారు. గ్రామస్థులు కోరిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అందించినట్లు ఆగం పాండు తెలిపారు. గ్రామంలో నిర్మించనున్న పోచమ్మ తల్లి దేవాలయానికి రూ.2 లక్షల విరాళం అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టప్ప కుమార్ ముదిరాజ్, జిల్లా నాయకులు కృష్ణ, గ్రామ సర్పంచ్ అనిత రమేష్, ఉపసర్పంచ్ నర్సింలు, చౌటకూర్ మాజీ సర్పంచ్ జనార్ధన్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెన్నయ్యతో పాటు సంఘం నాయకులు నర్సింలు, చెన్నయ్య, ఆంజనేయులు, సత్యనారాయణ, లక్ష్మయ్య, గోపాల్, పాండు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై భూపాల్ రెడ్డి ఫైర్



మెదక్ (ప్రజా జ్యోతి) పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో మూడవరోజు వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై మహిళా సమరభేరి సభ ఏర్పాటు చేశారు మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ హామీలు ఇచ్చి అది అధికారంలోకి వచ్చి హామీలు మరిచి ప్రజలను మోసం చేస్తున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీల్లో ఒక హామీని కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు ప్రతి మహిళకు నెలకు 2,500 తమన్న హామీ ఏమైంది విద్యార్థులకు స్కూటీలు ఇస్తామన్న మాట ఏమైంది కళ్యాణ లక్ష్మితో పాటు కులం



బంగారం ఇస్తామన్న హామీ ఎక్కడ కళ్యాణ లక్ష్మి పథకాన్ని మొత్తానికి ఎగవేసి ప్రయత్నం చేస్తున్నారు వృద్ధులు వితంతువులు దివ్యాంగులకు 2000 రూపాయలు పింఛన్లు పెంచుతామన్న హామీ ఏమైంది ఎన్నికల ముందు హామీల వర్షం తో అధికారంకు వచ్చాక మాటలా మాయజాలం మహిళ ఓట్లతో అధికారులను దక్కించుకొని అదే మహిళా సంక్షేమాన్ని విస్తరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతవరకు న్యాయమని భూపాల్ రెడ్డి గారు ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సర్పంచులు ఉపసర్పంచ్లు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు గ్రామ పార్టీ అధ్యక్షులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వనదుర్గమ్మను దర్శించుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్‌రెడ్డి



మెదక్ (ప్రజా జ్యోతి) అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి. వనదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వనదుర్గా భవానీ మాత అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న పద్మ దేవేందర్‌రెడ్డికి ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి



సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా మెదక్ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి కృపతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుభిక్షంగా జీవించాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు పద్మ దేవేందర్‌రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, నాయకులు న్యాయవాది జీవన్ రావు ,మెదక్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్ గడ్డమీద.కృష్ణ గౌడ్ మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్,ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్వేతకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

సిద్దిపేట,సెప్టెంబర్ 04 ,(ప్రజాజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్వేత రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. బోధనా



రంగంలో ఆమె అందిస్తున్న సేవలను గుర్తిస్తూ రాష్ట్రస్థాయిలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేయడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. డాక్టర్ శ్వేత అవార్డుకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ అన్నారు.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు బోధనా రంగంలో ఆమె చూపుతున్న అంకితభావం అభినందనీయమని అన్నారు. ఆమె సాధించిన ఈ గుర్తింపు కళాశాలలోని ఇతర అధ్యాపకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ డాక్టర్ శ్వేతను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణదేవి, కిషోర్, హరిప్రసాద్, డాక్టర్ స్వప్నతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ శ్వేతకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





నంగునూరు,సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి):- శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంమైన నంగునూరు లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని నామస్మరణతో ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. నినాదాలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా "జై శ్రీకృష్ణ"నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని సంఘం నాయకులు తెలిపారు. శ్రీకృష్ణుడి బోధనలు, ఆదర్శాలను ప్రజలు ఆచరించాలని వారు పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ యాదవ సంఘం నాయకులు, సభ్యులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొరివి కృష్ణ స్వామి జయంతి వేడుకలు



నంగునూరు సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి):- మండల పరిధిలోని పాలమాకులలో శుక్రవారం నాడు కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కృష్ణస్వామి విగ్రహానికి పూలమాలు వేసే నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొరివి కృష్ణ స్వామి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహా వ్యక్తి అన్నారు ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు ప్రభుత్వం వెంటనే ముదిరాజులను బీసీ డీ నుండి బీసీ ఏ లోకి చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతార బోయిన ఓజాల్ ఉప సర్పంచ్ చంద్రం నాయకులు వేణు చక్రవర్తి కనకరాజు ఐలయ్య సత్తయ్య మల్లేశం చంద్రయ్య రాజు లక్ష్మణ్ రాజయ్య బాలరాజ్ రవి ఆంజనేయులు స్వామి నాతోపాటు ముదిరాజ్ ముదిరాజ్ సంఘ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

# శ్రీ సరస్వతీ శిశు మందిర్ మెదక్ పాఠశాల నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

మెదక్ (ప్రజాజ్యోతి) దేవకీవసుదేవులకు కుమారుడుగా చతుర్భుజుడైన స్వామి ఆవిర్భవించినరోజు. వారు స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని చూసి స్వామిని స్తుతించారు. దాన్ని నారాయనతీర్థులవారు ఒక తరంగంలో చక్కగా చూపారు.

భావం దేవకీవసుదేవులు పరమానంద సాగరమగ్నులయి వినుతిస్తున్నారు.











మంగళస్వరూపా! శ్రీపతీ!
నీవు అపరిమిత జ్ఞానానంద స్వరూపుడవు.
సనకాదియోగులునూ, బ్రహ్మాదిదేవతలునూ నీ
మహిమను కనలేరు.
అట్టివాడవు మా గర్భాన ఈ చీకటింట ఉ
దయించడమేమి?
ఈ దివ్యకిరీటరత్న ప్రకాశమేమి?
ఈ పీతాంబర సుందర దివ్యమంగళ విగ్రహమేమి?
ఈ కౌస్తుభ వనమాలాలంకృత వక్షమేమి?
ఈ మకరకుండల ప్రభావిభావసిత కపోలమేమి?
ఈ కనుతామరల విలాసములేమి?
సకల దుష్ట తమస్సులను పారదోలు నీ
దివ్యపుంజమేమి?
ఆశ్చర్యంగా ఉంది.
దీనులమైన మమ్ము గావుము.
భూమియందు గురుభక్తి విశేషంగల
నారాయణతీర్థమునికి రక్షకుడవు కమ్ము.
తరంగం
మంగళాలయ మామవ దేవ

పంకజాసన భావిత భావ

1.దేవకీవసుదేవతనూజ
దివ్యకిరీట దళితభవబీజ
సర్వయోగివిచింత్యపదాబ్జ
సంగతాఖిలసాధుసమాజ

2.అపరిమితానందబోధస్వరూప
అతికరుణాకర కరధృతచాప
కపటదైత్యహార ఖండితపాప
కనకాంబరధర కలితకలాప

3.మకరకుండల కేయూరవిభూష
మనసిజశతకోటి మంజులవేష
వికచకమలసన్నిభ విపులాక్ష
విమలహృదయ గోపాలరక్ష

4.కలిత శ్రీకౌస్తుభ కమనీయ కంఠ
కరుణారసభర మిళిత వైకుంఠ
పరిపాలయభువి భాగ్యవితరణ
గురుభక్త నారాయణతీర్థ శరణ
అవతారిక

ఇట్లు తదేకచిత్తంతో భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని సేవించి,
కంసునివలన భయమునొందినవాడు గావున ఈ విధంగా విన్నవించుకొనుచున్నాడు వసుదేవుడు.

శ్రియఃపతీ!
సర్వాంతర్యామివగు నీవు ఎఱుగనిది ఉన్నదా?
సర్వేశ్వరుదవగు నీవు దేవబ్రాహ్మణరక్ష
ఎటులచేయనగునో? అది ఆనతిమ్ము. మరియు మహా
తపస్సంపన్నులగు మునీంద్రులకు గమ్యమైన నీ
దివ్యరూపమును దర్శింప శక్తులముగాని మాకు,

అంగరంగ వైభవంగా మెదక్ పట్టణ పురవీధుల గుండా శోభాయాత్రగా నిర్వహించడం జరిగింది చిన్నారులు కృష్ణా గోపిక వేషధారణలతో మెదక్ ను బృందావనంగా తలపించేలా మైమరిపించే చేశారు కృష్ణార్జునుల వేషధారణ భీముడు భగత్ సింగ్ చంద్రశేఖర్ ఆజా శివాజీ రాణి రుద్రమదేవి ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ఏకపాత్రాభినయం చేయడం జరిగింది. శిశు మందిర్ విద్యార్థిని విద్యార్థులు కోలాటం చెక్కభజన జడ కొప్పు నృత్యాలు మరియు యోగా చాప్ చేసి అందరినీ ఆకట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు జడ కొప్పు నృత్యం పాల్గొనడం జరిగింది. ఎంఈఓ శంకర్ ముఖ్య వక్తగా కవి భాను ప్రసాద్ వెంకట్ రామ్ రెడ్డి పాఠశాల సమితి అధ్యక్షులు డాక్టర్ బాను చందర్ పాఠశాల అధ్యక్షులు గంజి శ్రీనివాస్ రవీందర్ దత్తు సుధాకర్ కమిటీ మెంబర్ పూర్వ విద్యార్థులు ప్రధానాచార్యులు ఆచార్యులు పోషకులు పాల్గొనడం జరిగింది.

# పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ



మెదక్ (ప్రజాజ్యోతి) రామాయంపేట మున్సిపల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని రామాయంపేట మున్సిపల్ అధికారులు ప్రజలకు సూచించారు. డోర్ టు డోర్ వ్యర్థాల సేకరణ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణలో భాగంగా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శుక్రవారం 'డ్రై డే--ఫ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఏ. రవీందర్, వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది కలిసి వార్డులో విస్తృతంగా పర్యటించారు. మురికి కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇళ్లలో దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారానికి ఒకరోజు 'డ్రై డే' పాటించాలని అధికారులు సూచించారు. దోమలు, క్రిమికీటకాల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పలు పూల కుండీలు నీటి డబ్బాలు ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలని తెలిపారు వారానికి ఒకరోజు ఇంటితో పాటు పరిసరాలను పూర్తిగా పరిశీలించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలని అధికారులు సూచించారు దోమలు ఉత్పత్తికి అవకాశం లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అని కోరారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని పేర్కొంటూ డ్రైడే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు మున్సిపల్ పరిధిలో పరిశుద్ధమైన ప్రత్యేక దృష్టి సారించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ నాగలక్ష్మి మున్సిపల్ జవాన్లు ప్రవీణ్ కృష్ణా శంకర్ ఇతర మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం చలో హైదరాబాద్

## ● టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గాదరి పరమేశ్వర్



సిద్దిపేట,సెప్టెంబర్ 04 ,(ప్రజాజ్యోతి): ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గాదరి పరమేశ్వర్, జిల్లా కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించి సిద్దిపేట జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఉద్యోగి బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు కీలక భాగస్వాములని, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలను అందించడంలో ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు ఉద్యోగుల న్యాయమైన హక్కులు, ప్రయోజనాలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను సెప్టెంబర్ 10లోపు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిస్తే ప్రభుత్వానికి ఉద్యోగుల తరఫున అభినందనలు తెలియజేస్తామని, ప్రభుత్వ పాలనకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ నిర్వాసితుల హామీలు అమలు చేయాలి

## ● కేసీఆర్ ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి ● తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి



గజ్వేల్, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి): మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన ముంపు గ్రామాల ప్రజలకు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి న్యాయం చేయాలని తెలంగాణ జన సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ పరిధిలోని ముంపు గ్రామాల ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇంటింటా పర్యటించిన ఆయన నిర్వాసితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేములఘాట్, పల్లెపాడు, కిష్టాపూర్, ఎర్రవెల్లి తదితర గ్రామాల ప్రజలు పునరావాసం, నష్టపరిహారం, ఉపాధి, ఇళ్ల స్థలాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మల్లన్న సాగర్ నిర్మాణ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని, అదే విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు ఇచ్చిన హామీలను కూడా తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారినా నిర్వాసితుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు శాశ్వత జీవనోపాధి కల్పించడంతో పాటు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు అందని అర్హులైన కుటుంబాలను గుర్తించి పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని అన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితులపై గతంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని, ముఖ్యమంత్రి స్వయంగా బాధితులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల హక్కుల కోసం తెలంగాణ జన సమితి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు కీసర స్వామి, లక్ష్మాపురం కనకయ్య, నాన్నం గిరి, ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ మోసపు హామీలను అమలు చేసే వరకు వదలం

- మహిళలకు నెలకు రూ.2,500 ఎప్పుడిస్తారు
- కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్‌తో ఆడపడుచులకు తులం బంగారం హామీ ఏమైంది
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చేసారా!
- మోసపో హామీలతో మోసగించొద్దు
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన మాజీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి








తాండూరు సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసపు హామీలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. శుక్రవారం రోజు తాండూరు పట్టణంలోని శ్రీ కాళీక మాత ఆలయంతో పాటు శ్రీ భద్రేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన రోహిత్ రెడ్డి వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని భద్రేశ్వర చౌక్ వద్ద ఏర్పాటుచేసిన వంటా వార్పు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అందించే ఆసరా పెన్షన్ రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంపు హామీ ఎక్కడ ఉందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 రూపాయలు ఇస్తామన్న హామీ ఏమైంది అని ప్రశ్నించారు. ప్రతి మహిళను మహాలక్ష్మిని చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసి మహిళలు బస్సుల్లో ఇబ్బందులు పడే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు.

తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లడానికి బస్ స్టాండ్‌కు వెళ్తే గంటల తరబడి నిలబడినా బస్సులు రావడం లేదని గుర్తు చేశారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పది మంది మహిళలకు ఇచ్చి అందరికి ఇచ్చినట్లు చెబుతున్నారని విమర్శించారు. మహిళలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పెళ్లి చేసుకున్న వారిలో ఒక్కరికైనా తులం బంగారం వచ్చిందా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 1000 రోజులు అవుతుందని, మరి మహిళలను కోటీశ్వరులను ఎప్పుడు చేస్తారన్నారు.

అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అన్నింటినీ మరచిపోయిందని అన్నారు. మహిళల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పైలట్ రోహిత్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా "వంటా వార్పు"






ఉప్పల్, సెప్టెంబర్ 4, ప్రజాజ్యోతి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "వంటా వార్పు" నిరసన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని డా. ఏఎస్ రావు నగర్, వంపుగూడ, మల్లాపూర్ (అశోక్ నగర్), నాచారం, (హెచ్ఎంటి నగర్) రామంతాపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన వంటా వార్పు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

మహిళలకు నెలకు ?2,500, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిగి నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు సవరణ ప్రచారానికి ఏర్పాట్లు

- సెప్టెంబర్ 5, 6 అలాగే 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు
- పోలింగ్ కేంద్రాల్లో డ్రాఫ్ట్ ఓటరు జాబితా పరిశీలనకు అవకాశం




పరిగి, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు, జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి మార్గదర్శకాలకు అనుగుణంగా 01 అక్టోబర్ 2026 అర్హత తేదీగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ప్రచార దినాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు.

నియోజకవర్గ పరిధిలోని సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు), తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తోపాటు ఇతర అధికారులకు సూచనలు జారీ చేశారు. గ్రామ పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల స్థాయిలో బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలు పెద్ద ఎత్తున పాల్గొని ఓటర్ల నుంచి ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరించి బిఎల్ఓ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేక ప్రచార దినాల సందర్భంగా ఓటర్లకు అవసరమైన సమాచారం, సేవలు అందుబాటులో ఉంచనున్నారు.

మొదటి విడత ప్రత్యేక ప్రచార కార్యక్రమం సెప్టెంబర్ 5, 6 తేదీల్లో, రెండో విడత సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నాలుగు రోజులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓలు అందుబాటులో ఉంటారని ఎన్నికల నమోదు అధికారి తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో పరిగి అభివృద్ధికి కొత్త దిశ

- ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో ముందుకు
- ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి



పరిగి, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పరిగి పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, మైనారిటీల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పాలన కొనసాగిస్తోందని ఆయన తెలిపారు.

నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మరో 2,500 ఇళ్లు మంజూరై మొత్తం 6,000 పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ?2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి, పరిగి నియోజకవర్గ రైతులకు సుమారు ?300 కోట్ల మేర ప్రయోజనం కల్పించామని తెలిపారు. అదేవిధంగా రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, అర్హులకు పెన్షన్ మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కొందుర్గ్--పరిగి--లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణకు ?587 కోట్లు, పరిగి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ?28 కోట్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ?200 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. పరిగి--వికారాబాద్, పరిగి--షాద్‌నగర్ రహదారుల అభివృద్ధి, వివిధ గ్రామాల్లో డబుల్ రోడ్లు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

విద్యుత్ రంగంలో 220 కేవీ, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, జాఫర్‌పల్లి, తుంకులగడ్డ, నస్కల్, పరిగి ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే పరిగి ప్రజల చిరకాల కోరికైన రైల్వే మార్గం కోసం సర్వే పూర్తైందని, రీజినల్ రింగ్ రోడ్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. పరిగి నియోజకవర్గానికి సుమారు 3,000 కోట్ల విలువైన నేవీ ప్రాజెక్టు రావడం గర్వకారణమని, దీని ద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, పరిగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.



## ప్యాకేజీల నాయకుడివి మాకే నీతులు చెప్తావా!

- డ్రగ్స్, గంజాయి కేసులో జైలు కెళ్ళింది ఎవరు - మాఫియా అనే మాటకు అర్థము ఉందాలి
- ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక్కసారైనా మున్సిపల్ సమావేశం జరిగిందా
- రోహిత్ అన్న నీ వెంబడి ఐ దేండ్లు ఉన్నాం నీ గురించి మాకు తెలియదా
- వార్డుకు కోటి రూపాయల శిలాఫలకాలు కనిపిస్తున్నాయి - చిలుక వాగు ప్రక్షాళన కోసం ఐదేళ్లు వేడుకున్నాం
- రెండున్నర సంవత్సరాలలోనే చిలుక వాగు నిర్మాణం పూర్తి కానుంది - బురదజల్లే రాజకీయాలు మానుకోవాలి
- మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి





తాండూరు సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి : ప్యాకేజీల నాయకుడివి నువ్వు మాకే నీతులు చెబుతావా అని బిఆర్ఎస్( భారతీయ రాష్ట్ర సమితి) పార్టీకి చెందిన ఓ నాయకుడి పై మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం రోజు తాండూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ..

తాను కౌన్సిలర్‌గా ఉండి అయిదేళ్ల కాలం పాటు నువ్వేంటి నీ విధాలు విధానాలు ఏమిటో తనకు తెలుసు రోహిత్ అన్న అంటూ సున్నితమైన మాటలతో స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఇదివరకు డ్రగ్స్ కేసులో అడ్డంగా పట్టు బడి జైలు జీవితం అనుభవించి వచ్చిన నువ్వు ప్రజల ముందు మాట్లాడడం చూస్తుంటే మీ వ్యవహారం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. చిలుక వాగు నిర్మాణం కోసం ఐదేళ్లు బ్రతిమాలాడినా కూడా పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పై విమర్శించారు. వార్డుకు కోటి రూపాయల అభివృద్ధి పనులు అని అప్పట్లో వేసిన శిలాఫలకాలు అవి అలాగే వెక్కిరిస్తున్నాయని గుర్తు చేశారు. అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి మీ మాజీ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలు కోర్టులలో ఉన్నాయనేది మర్చిపోతున్నారని గుర్తు చేశారు. ప్రజల మనిషి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై నోటికి వచ్చినట్లు అనుచిత వాక్యాలు చేస్తే సహించం అని హెచ్చరించారు.

గురువారం జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో అర్థం లేని మాటలు అనడం కాదు ఆధారాలు ఎక్కడున్నాయో ప్రజల ముందు పెట్టాలని హెచ్చరించారు. 24 ఎకరాలు, సిబిఐ కేసు, హైకోర్టు స్టే, 33 ఎకరాల ప్రభుత్వ భూమి అనే విమర్శలకు ఏ విధమైన అర్థం ఉందో మీరే పునరాలోచన చేసుకోవాలని విమర్శించారు.

ఇబ్రహీంపట్నంలో 33 ఎకరాల ప్రభుత్వ భూమి అంటున్నారు. ఫైనల్ రెవెన్యూ ఆర్డర్ ఏది.? కలెక్టర్ ప్రొసైడింగ్ నంబర్ ఏది? మనోహర్ రెడ్డి ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఏ కోర్టైనా తీర్పు ఇచ్చిందా? ఉంటే ఆ జడ్జిమెంట్ చూపించండి అంటూ ప్రశ్నించారు. వికారాబాద్‌లో 250 ఎకరాలు అంటున్నారు భూమికి సంబంధించిన సర్వే నంబర్ లు ఏవి, కేసు నంబర్, అక్రమం జరిగిందని నిర్థారించిన ఫైనల్ ఆర్డర్/ కోర్టు జడ్జిమెంట్ ఏవైనా ఆధారాలు ఉంటే నిజాయితీపరులు అనుకుంటే బయటపెట్టండి అని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసినంత మాత్రాన అవి నిజాలు కావని కొట్టి పారేశారు.

మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి : తాండూర్ మండలం సిరిగిరి పేట్ లో భూ కబ్జాలు, విద్యావికాస్ ట్రస్ట్ భూముల వ్యవహారం, వ్యాపారాలను బెదిరించి ప్లాట్స్ కబ్జాలు, వసూలు ఇవన్నీన ఆధారాలతో సహా నిరూపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐసిసి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఖాసిం, సీనియర్ నాయకులు ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ ఎల్లప్ప ఉన్నారు.

## వసతి గృహంలో ఏ సమస్యలున్న చెప్పండి

- పరిష్కరించేందుకు కృషి చేస్తా విద్యార్థులతో మాట్లాడిన చైర్పర్సన్
- భోజనం ఎలా ఉంది విద్యార్థులతో కలిసి భోజనం చేసిన నాయకులు





తాండూరు సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి : తాండూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయిపూర్ 10వ వార్డులో కొనసాగుతున్న ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు రోజు అందించే అల్పాహారం వడ్డించి, కిచెన్ గదిని పరిశీలించారు.

అనంతరం విద్యార్థినుల ఆరోగ్యం, వసతి, భోజనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం కూడా అందిస్తానని చైర్పర్సన్ భరోసా కల్పించారు.

రోజు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే దానిపై కలిసి చైర్ పర్సన్ నీరజా బాల్ రెడ్డి స్థానిక కౌన్సిలర్ పలువురు నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిపూర్ 10వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రహీం



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి నాయకత్వంలో, కుత్బుల్లాపూర్ మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్ గఫర్ ఆధ్వర్యంలో 289 డివిజన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్‌గా షేక్ అబ్దుల్ రహీంకు బాధ్యతలు అప్పగించారు.

289 డివిజన్ అధ్యక్షులు బి. శివకుమార్ గౌడ్ సూచన మేరకు ఈ నియామకం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మైనార్టీల సమస్యల పరిష్కారానికి అబ్దుల్ రహీం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో 289 డివిజన్, రాజూరా బ్యాంక్ డైరెక్టర్ డప్పు నరేందర్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్ల శ్రీను, చింతల నాగరాజు యాదవ్, చింతల సాయి కుమార్ యాదవ్, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ వర్షియావత్ విజయ నాయక్, ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ హేమచంద్ర నాయక్, జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

యాదవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం




బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి) : యాదవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు--2026 ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ఏకుల మహేశ్వర్ రెడ్డి, కె. పాండు యాదవ్ తదితరులు వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోయిన్‌పల్లి నేతాజీ నగర్‌లోని యాదవ్ సంఘం భవన్, పెద్ద తొక్కట్ట, న్యూ బోయిన్‌పల్లి, వార్డు--1 పరిధిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. శ్రీకృష్ణుని బోధనలు, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి సద్గుణాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదవ్ సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు భూసేకరణ గెజిట్

- రూ.587 కోట్ల నిధుల కేటాయింపు..
- 191 ఎకరాలకు గెజిట్ విడుదల



షాద్ నగర్, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి) : లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి మరో కీలక ముందడుగు పడింది. రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గెజిట్ నంబర్ 140ను విడుదల చేశారు. మొత్తం 191 ఎకరాల భూసేకరణకు గెజిట్ విడుదల కావడంతో షాద్‌నగర్ జేసీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేసీసీ నాయకులు రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి సంబరాలు నిర్వహించారు.

గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అధికారంలోకి వస్తే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని వారు పేర్కొన్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టుబట్టి చర్చించడంతో భూసేకరణకు రూ.587 కోట్లు కేటాయించారని జేసీసీ నాయకులు తెలిపారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రిజర్వా యర్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం అభినందనీయమ న్నారు. రిజర్వాయర్ పూర్తయితే ఈ ప్రాంత రైతాంగానికి సాగునీటి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేసీసీ నాయకులు జనార్దన్, వంగూరి గంగిరెడ్డి, నర్సింగౌడ్, బాదేపల్లి సిద్ధార్థ, గొర్ల రాము, గద్దం జంగయ్య, నర్సిలు, గణేష్, నక్క బాలరాజ్, కృష్ణయ్య, మందారం నర్సిలు, పరంజ్యోతి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



## నాచుపల్లిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కొడిమ్యాల, సెప్టెంబర్ 4,(ప్రజాజ్యోతి):
మండలంలోని నాచుపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగ గురువు సుధాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో యోగ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వీఓఏగా అవకాశం కల్పించాలి

### మంత్రి అడ్లూరీ కి వినతి పత్రం అందించిన సిగిరి సునీత ఆనంద్,

ఎండపల్లి, సెప్టెంబర్ 4, ప్రజా జ్యోతి
మండలంలోని చెర్లపల్లి గ్రామంలో వీఓఏగా విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ సిగిరి సునిత శుక్రవారం రోజున సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 2009 నుంచి 2025 వరకు వీఓఏగా విధులు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. గ్రామంలో వీఓ భవనం కోసం నిర్మాణానికి కృషి చేసినట్లు,అలాగే ఐకేపీ కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోళ్లలోనూ సేవలందించినట్లు, పేర్కొంటూ,ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీఓఏ పదవికి రాజీనామా చేసినట్లు కానీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు వినతి పత్రంలో తెలిపారు , ప్రస్తుతం తిరిగి వీఓఏగా విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని ,ఈ విషయంపై , డీఆర్డీవో అధికారులతో మాట్లాడి సహకరించాలని మంత్రిని కలిసి విన్నవించారు,

## సర్వాపూర్ లో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

మల్యాల,సెప్టెంబర్ 4, ప్రజా జ్యోతి:
ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సర్వపూర్ గ్రామానికి చెందిన సాయవేణి లతా శ్రీశైలం ల ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపి దంపతులకు కానుకను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన



కార్యదర్శి నక్క అనిల్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శనిగారపు తిరుపతి, ఫ్యాక్స్ చైర్మన్ నేరెళ్ల సతీష్ రెడ్డి, మ్యాక లక్ష్మణ్,ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, బండి రవి గౌడ్, బివి రమణ, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ రద్దు చేయకపోతే సొసైటీ ముందు ధర్నా

### పది రోజులుగా యూరియా లేక అల్లాడుతున్న రైతులు..

### వరి పంటలు ఎర్రబడి రోగాల బారిన



కోనరావుపేట,సెప్టెంబర్.03 (ప్రజా జ్యోతి) అప్పట్లో వర్షాలు లేక నష్టపోయిన రైతులు.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ తో పది రోజులుగా యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాప్ ఎలా వాడాలో తెలియక చాలా మంది రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు తెలిసిన వారి దగ్గరికి వెళ్తున్నారు. వారు వెళ్లేసరికి టైం అయిపోయిందని చెబుతుండడంతో రోజూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. యాప్ లో స్లాట్ ఓపెన్ అయిన రెండు మూడు సెకన్లలోనే క్లోజ్ అవుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో యూరియా చల్లకపోవడంతో వేసిన వరి పంటలు ఎర్రబడుతున్నాయి. పంటకు ఇతర రోగాలు వస్తున్నాయని, దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.
రైతుల డిమాండ్: వెంటనే ఈ యూరియా యాప్ విధానాన్ని తొలగించి, గతంలో మాదిరిగా రైతు పాస్ బుక్, ఆధార్ కార్డు చూసి నేరుగా యూరియా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఇవ్వని యెడల తమ పంటలను తీసుకువచ్చి సొసైటీ ముందు ధర్నా, నిర్వహిస్తామని రైతులు హెచ్చరించారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి:
శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గాయత్రి విద్యానికేతన్‌లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కరస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులకు శ్రీకృష్ణుని జన్మ విశిష్టత, కృష్ణ తత్వం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను వివరించారు. 6వ, 7వ, 2వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 1వ తరగతి విద్యార్థిD. సాయి శ్రీమాన్ జగన్నాథ స్వామి వేషధారణలో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాడు. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం ఆద్యంతం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంలో సాగింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, శ్రీకృష్ణుని జీవితం, బోధనలు పరిచయం అవుతాయని, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు.




# మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ 'వంటా వార్పు' నిరసన

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి ) కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మహిళలను మోసం చేసిందని, రానున్న రోజుల్లో ప్రజలే ఆ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కరీంనగర్ నగర బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 'వంటా వార్పు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలతో కలిసి వంటా వార్పులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలయ్యే అనేక సంక్షేమ కార్యక్రమాలు మహిళలతో ముడిపడి ఉంటాయని, అలాంటి మహిళలనే కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడబిడ్డల వివాహాల కోసం 'కళ్యాణలక్ష్మి' పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కళ్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, అలాగే మహిళలకు ప్రతినెలా రూ.2,500, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అయితే ఆ హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు.ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు మహిళల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రజా సమస్యలపై నిరసనల ద్వారా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగుతుందన్న నమ్మకం లేదు' మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కొండా సురేఖ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ఆమె రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి వికెట్ పడిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మంత్రివర్గంలో రెండు కుటుంబాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. ఈ పరిణామాలను చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగుతుందన్న నమ్మకం తనకు లేదని అన్నారు. ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజురోజుకూ కోల్పోతున్నారని వినోద్ కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, రానున్న రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, సుధగోని మాధవి, గాదె రూప, యూసుఫ్, అలీ, జమ్ము, కరీంనగర్ రూరల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కరీంనగర్- చొప్పదండి వాహనదారులకు ఊరట

- తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్ద తారు రోడ్డు నిర్మాణం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో రోడ్డు నిర్మాణం

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి )
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ ఫలించింది. కరీంనగర్ లోని తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణంలో తీవ్రమైన జాప్యం జరుగుతుండటం, ఈ ఆర్వోబీ నిర్మాణం పూర్తి విషయంలో 2028 వరకు కాంట్రాక్టర్ కు గడువు ఉండటంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు గత కొంతకాలంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్వోబీ వద్ద వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా తారు రోడ్డును నిర్మించాలని స్థానిక ప్రజలు ఎప్పటి నుండో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అటువైపు వెళ్లే వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ తీసుకుని మున్సిపల్ నిధులతో ఆర్వోబీ వద్ద రోడ్డును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను సూచించారు. కేంద్ర మంత్రి సూచన మేరకు మేయర్ కొలగాని శ్రీనివాస్ రూ.28 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో అటువైపు వెళ్లే వాహనదారులకు కొంత ఉపశమనం కలగనుంది. మరోవైపు తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ పాలనలో తీవ్ర జాప్యం జరిగింది. నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్రాల వాటా ఉన్నప్పటికీ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తన వాటా నిధులను చెల్లించలేదు. అయినప్పటికీ నాడు బండి సంజయ్ చొరవ తీసుకుని కేంద్రాన్ని ఒప్పించి ఆర్వోబీ నిర్మాణానికయ్యే రూ.156 కోట్ల మొత్తాన్ని కేంద్రం నుండి మంజూరు చేయించారు. ఆ తరువాత భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అయినప్పటికీ, ఈ విషయంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణను వేగవంతం చేసింది. మరోవైపు ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి 2028 వరకు గడువు ఉండటంతో సదరు కాంట్రాక్టర్ సైతం నత్తనడకన ఆర్వోబీ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అటువైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు తాత్కాలికంగా ఉపశమనం కలిగించేందుకు ఆ ప్రాంతంలో రోడ్డును నిర్మించడం గమనార్హం.



## చొప్పదండిని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెడతా

-ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
-"1000 రోజుల పాలన.. 1000 బైక్‌ల విజయోత్సవం"

కొడిమ్యాల, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి): చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంగడి బజార్ నుంచి పూడూర్ వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుమారు వెయ్యి బైక్‌లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నిర్బంధాలు ఉండేవని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన అందుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో 5 వేలకుపైగా ఇళ్ల నిర్మాణం చేపట్టామని, కొత్త రేషన్ కార్డులు, గృహ విద్యుత్, చేయూత పింఛన్లు అందించామని తెలిపారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసి, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు.చొప్పదండి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రామడుగులో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కొడిమ్యాలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్, కొండగట్టు జేఎన్టీయూకు యూనివర్సిటీ హోదా కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని ఇరిగేషన్, ఎడ్యుకేషన్, పరిశ్రమల రంగాలకు హబ్‌గా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడతానన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషన్ రెడ్డి,సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్ రెడ్డి,మండల అధ్యక్షుడు కదారి మల్లేశం,ప్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు,చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కొత్తూరి మహేష్,యువజన నాయకుడు చిర్ర చింటు,ఏయంసి వైస్ చైర్మన్ కొండూరి రాజేష్,యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్,మండల అధ్యక్షుడు గాజుల అజయ్, నాయకులు గోల్కొండ రాజు, అంతడుపుల జలందర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అరాచకాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు: బిజెపి మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్

కేశవపట్నం:సెప్టెంబర్4 (ప్రజా జ్యోతి) కరీంనగర్ జిల్లా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, మహనీయుడు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు చల్లి అవమానించడాన్ని నిరసిస్తూ, అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయం మరియు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడిని ఖండిస్తూ కేశవపట్నం మండల కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల శాఖ అధ్యక్షులు కనకం కుమారస్వామి మండల శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం, సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ఖండించారు. అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయంపై, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణమని అన్నారు. ఈ దాడిలో ఆయన తల్లి గాయపడటం అత్యంత అమానుషమని, మహిళల పట్ల కూడా కనీస గౌరవం లేకుండా కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏనుగుల అనిల్మాట్లాడుతూ, ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి మా హెచ్చరిక. భారతీయ జనతా పార్టీ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. హద్దుల్లో ఉండండి. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇప్పటికే గమనిస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, ప్రతిపక్షాలపై దాడులు చేయడం మానుకోవాలి. భారతీయ జనతా పార్టీ ఉద్యమించాలని నిర్ణయించుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మనుగడ ఉండదు. ప్రజల సమస్యలను పరిష్కరించి సుపరిపాలన అందించడంపై దృష్టి పెట్టాలి. అరాచకాలు, గూండాయిజం, ప్రతీకార రాజకీయాలకు స్వస్తి చెప్పాలి అని హెచ్చరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ మరింత ఉద్ధృతంగా పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య , మాజీ ఎంపీపీ దొంగల రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ దాసరపు నరేందర్, బిజెపి సర్పంచ్లు వెన్నం మల్లేశం కొయ్యడ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ జంగ జైపాల్, కొయ్యడ అశోక్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మచెట్టు సంపత్ రావు,మండల ఉపాధ్యక్షులు ఎలుక పెల్లి సంపత్ , రాసమల్ల శ్రీనివాస్ , కార్యదర్శి గౌరవేణి శ్రీనివాస్ , బిజిలి సారయ్య, బోడ తిరుపతి రెడ్డి,మహిళ మోర్చాఅధ్యక్షురాలు చర్ల అనిత యువ మోర్చా మండల అధ్యక్షుడు బొజ్జ సాయి ప్రకాష్ బిజెపి సీనియర్ నాయకులు పలకల రాజిరెడ్డి, మందాడి జగ్గారెడ్డి, రాజిరెడ్డి.జాన పట్ల రాజిరెడ్డి దాసరి సంపత్,చర్ల శ్రీనివాస్ , శివారెడ్డి, వీరా అర్జున్, రంజిత్ శ్రీనాథ్ ,కుమార్ , వికాస్, సాయి, మైపాల్ ,బీజేపీ మండల నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


### పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూతగడ్డ సంపత్‌కు ముదిరాజ్ సంఘం ఘన సన్మానం

పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి:
పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముదిరాజ్ బిడ్డ భూతగడ్డ సంపత్ నియమితులైన సందర్భంగా పెద్దపల్లి జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీల్లో కొనసాగుతున్న ముదిరాజులను గుర్తించి తగిన రాజకీయ ప్రాధాన్యత, గుర్తింపు కల్పించాలని కోరారు. ముదిరాజుల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూతగడ్డ సంపత్‌కు పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి దక్కేలా సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్‌లకు జిల్లా ముదిరాజ్ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిద్ధ మధు ముదిరాజ్, గరిగంటి నరసింహారాజు ముదిరాజ్, ఎల్లంకి పోచాలు ముదిరాజ్, చింతల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్యాలపై మహిళల ఆగ్రహం

పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు రోడ్డుపైనే కూరగాయలు తరిగి వంటావార్పు నిర్వహించారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పాటు ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ పాటలు పాడి వినూత్నంగా నిరసన తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెంచిన పెన్షన్లు, విద్యార్థినీలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి–షాదీముబారక్ మొత్తాల పెంపు వంటి హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. "ఒక్క నెల ఆగండి.. రూ.4,000 పెన్షన్ ఇస్తాం" అని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, 1000 రోజులు పూర్తవుతున్నా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒంటరి మహిళలకు పెన్షన్, బీడీ కార్మికులకు పెన్షన్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలను అమలు చేసి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. విద్యార్థినీలకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం సైకిళ్లు కూడా ఇవ్వలేకపోతోందని ఎద్దేవా చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు. మహిళలను మోసం చేసిన కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమత రెడ్డి మాట్లాడుతూ మహిళల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వాటిని ఒక్కొక్కటిగా పక్కన పెడుతోందని విమర్శించారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థినీలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మొత్తాల పెంపు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి సంక్షేమ పథకాలను బలోపేతం చేయాల్సింది పోయి వాటి ప్రయోజనాలను మహిళలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వాటికి గడువు ప్రకటించాలని, లేకపోతే మహిళలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని దాసరి మమత రెడ్డి హెచ్చరించారు. మహిళల హక్కులు, హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.



## శ్రీకృష్ణ శతక పద్యాల పోటీలలో సత్తా చాటిన శ్రీ భాస్కర్ మెమోరియల్ స్కూల్ విద్యార్థుల



ఎర్రుపాలెం ప్రజా జ్యోతి శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకునిశుక్రవారం మధిర, సుమిత్ర యూత్ వారి ఆధ్వర్యంలో శ్రీ రామాలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీకృష్ణ శతక పద్య పోటీల లో మండలానికి చెందిన మీనవోలు శ్రీ భాస్కర్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి అన్ని విభాగాల్లోనూ బహుమతులు కైవసం చేసుకున్నారు. సబ్-జూనియర్ విభాగంలోచింత హిరణ్య ప్రథమ బహుమతి జూనియర్ విభాగంలో ముక్కర పవిత్ర --ప్రథమ బహుమతి లోడుగు విష్ణు ప్రియ తృతీయ బహుమతి సీనియర్స్ విభాగంలో ప్రత్యేక కన్సోలేషన్ బహుమతులు శీలం సత్యనారాయణ రెడ్డి తోట గ్రీష్మ సాధించారు అత్యంత ప్రతిభతో బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ భట్లపెనుమర్తి సూర్యనారాయణ, డైరెక్టర్ బి వెంకటేశ్వరావు, తెలుగు బోధకులు రావూరి గిరిబాబు మేరీ మరియు ఉపాధ్యాయులు అభినందించారు

## తేజ వొకేషనల్, పారామెడికల్ కళాశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సత్తుపల్లి సెప్టెంబర్04(ప్రజా జ్యోతి) పట్టణంలోని తేజ వొకేషనల్,పారామెడికల్ కళాశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత ఘనంగా ఉత్సాహంగా శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల చైర్మన్ జి.వీరా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం విద్యార్థులలో విశేష ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా చైర్మన్ జి .వీరా రెడ్డి మాట్లాడుతూ, శ్రీకృష్ణుని భగవద్గీత బోధనలు, ఆయన బాల్య లీలలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. ప్రభాకర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం,సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వేడుకల అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

## తెలంగాణ ఆడపడుచులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం



ఎర్రుపాలెం ప్రజా జ్యోతి ఆరు గ్యారంటీ లు, 420 హామీలు ఇచ్చి ఆదికారం లోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదటి రోజు నుండేతెలంగాణ ప్రజలను మోసం చేసింది. ముఖ్యం గా ఆడబిడ్డలను తులం బంగారం, ప్రతి మహిళకి 2500 రూపాయలు, వృద్దులకు, 4000రూపాయలు, వికలాంగులకి 6000 రూపాయలు, విద్యార్థుల కు స్కూటీ లు ఇస్తాం అని చెప్పి ఎన్నికలు జరిగి 1000 రోజులు దాటినా ఇచ్చిన హామీలు మరిచి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుంది. మహిళకు బాకీ పడిన మొత్తాన్ని వెంటనే వారి అకౌంట్ లలో వెయ్యాలని లేకపోతే మహిళలు తగిన బుద్ధి చెప్తారని కమలరాజు అన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై కెసిఆర్ పిలుపు మేరకు శుక్రవారం ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు మాజీ జడ్పీటీసీ శీలం కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంట వార్పు కార్యక్రమం కి ముఖ్య అతిధి గా పాల్గొన్న మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు పాల్గొన్నారు మహిళలతో కలిసి రింగ్ సెంటర్ లో వంటలు వండి కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన తెలియజేశారు. తరువాత వారితో కలిసి సామూహిక భోజనం చేసారు. ఈ కార్యక్రమం లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ పార్టీ కార్యదర్శి యన్నం శ్రీనివాస రెడ్డి,, సర్పంచులు శీలం కోటి రెడ్డి, బెంజిమెన్,లాలయ్య, మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రావు, కృష్ణారెడ్డి, రేణుక, సాంబశివరావు మాజీ ఎంపీటీసీ లు మస్తాన్ వలి, మల్లికార్జున రెడ్డి, కృష్ణరావు, బొర్రా నరసింహారావు, రమణారెడ్డి గద్దల శ్రీనివాస రావు, నాగేశ్వరరావు, బాబూసా, సుభాని మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి: ఏఐటీయూసీ

★ సమస్యలతో కూడిన వినతిపత్రం మంత్రికి అందజేత



సత్తుపల్లి సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ ( సీతక్కకు) మధ్యాహ్నం భోజన పథకం (ఏఐటీయూసీ) కార్మికులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజన కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మంత్రికి వివరించారు. 24 సంవత్సరాలుగా అనేక కష్ట నష్టాలు ఓర్చి,పిల్లలకు పోషక ఆహారాన్ని అందిస్తున్నారని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగ అల్పాహార పథకాన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలకు అప్పగించే సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి అల్పాహార పథకాన్ని వంట కార్మికులతో కొనసాగించాలని, మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, తడికమల్ల యోబు, రామకృష్ణ, వేము రాంబాబు మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ నాయకురాలు పూచి సీత, సత్యవతి, రామంజమ్మ, సీతమ్మ. వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాజ్యోతి ఎఫెక్ట్...

★ ప్రజాజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు

★ సురక్ష బస్టాండ్ వద్ద గుంతలు మాయం,తొలగిన మట్టి కుప్పలు

★ ప్రజాజ్యోతి కథనం..అధికారుల స్పందన.. ప్రజలకు ఊరట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 04,(ప్రజాజ్యోతి) ప్రజా సమస్యలపై ప్రజాజ్యోతి అస్త్రం పనిచేసింది. మణుగూరు సురక్ష బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చకుండా దుకాణాల ముందు మట్టి కుప్పలు వదిలేశారని, దుమ్ము ధూళితో ప్రజలు నరకం చూస్తున్నారని గురువారం ప్రజాజ్యోతి లో ప్రచురితమైన వార్త కథనానికి మణుగూరు మున్సిపల్




అధికారులు వెంటనే స్పందించారు. గురువారం వరకు దాదాపు పది రోజులుగా అలాగే వదిలేసిన మట్టి కుప్పలను తొలగించి, ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను యాష్ కంకర మట్టితో పూడ్చి చదును చేశారు. దీంతో వాహనదారులు, వ్యాపారులు, పాదచారులు



ఊపిరి పీల్చుకున్నారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రజాజ్యోతికి, స్పందించిన మున్సిపల్ అధికారులకు స్థానిక వ్యాపారులు,ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రజాజ్యోతి పోరాటం ఇలాగే కొనసాగాలని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# రోడ్ల పక్కన చికెన్ వ్యర్థాల కుప్పలు..!

★ గ్రామీణ ప్రాంతాల్లో దుర్వాసన.. పారిశుద్ధ్యంపై ప్రశ్నలు ★ హస్నాబాద్ నుంచి బచ్చోడు వరకు అధికారుల నిఘా అవసరం

తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 4: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని హస్నాబాద్, బచ్చోడు, సుబ్బులేడు, రఘునాథపాలెం, జూపేద, కాకరవాయి తదితర గ్రామాల పరిధిలోని కొన్ని రహదారుల పక్కన చికెన్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**ఈకలు.. మాంసపు అవశేషాలు.. దుర్వాసన**

చికెన్ దుకాణాల నుంచి వెలువడే ఈకలు, మాంసపు అవశేషాలు, ఇతర వ్యర్థాలను కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగా పడేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వస్తోందని, రోడ్ల వెంట ప్రయాణించే వారు, సమీప నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**చెత్త కుప్పల్లో మాంసపు వ్యర్థాలు?**

సాధారణ చెత్తతో పాటు మాంసపు వ్యర్థాలు కూడా కలిసిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలపై ఈగలు, ఇతర కీటకాలు చేరుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ.?**







మండలంలోని చికెన్ దుకాణాల వద్ద వ్యర్థాల నిర్వహణపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. దుకాణాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను నిబంధనల ప్రకారం సేకరిస్తున్నారా? బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.


**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వ్యర్థాలు పేరుకుపోకుండా గ్రామపంచాయతీ అధికారులు పర్యవేక్షణ పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడంతో పాటు, బహిరంగంగా వ్యర్థాలు పడేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించి, హస్నాబాద్ నుంచి కాకరవాయి వరకు పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గంగారం యుగకర్త మన మధుబాబు ఎమ్మెల్యే రాగమయి

★ గౌడ కమ్యూనిటీ హాల్,శ్రీకృష్ణ మందిరం హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే ★ ప్రజల శ్రేయస్సు కోరే ప్రజల అభిమాని మధుబాబు

సత్తుపల్లి సెప్టెంబర్04(ప్రజా జ్యోతి) గంగారం గ్రామపంచాయతీకి యుగకర్తగా మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ అభివృద్ధి ప్రదాత వెంకట్రామిరెడ్డి(చిట్టి నాయన) రాజకుమారిల కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు) అని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం మధుబాబు తన సొంత నిధులతో లక్షలు వెచ్చించి గౌడ కమ్యూనిటీ హాల్ ని నిర్మించారు.









అదేవిధంగా శ్రీకృష్ణ మందిరం దగ్గర కళ్యాణం చేసుకునేందుకు భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఆమె గంగారం గ్రామం చేరుకొని, అక్కడ నుండి సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసినారు. అనంతరం నిర్మాణానికి సిద్ధంగా వాటిని ప్రారంభించారు. శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేసి, భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగారానికి యువకర్తగా మధుబాబు ఉన్నారని, ప్రజలకు ఏమేమి అవసరాలు ఉన్నాయో గుర్తించి, అభివృద్ధి చేస్తున్నారని ఇలాంటి వ్యక్తులు అరుదుగా సమాజంలో ఉంటారని, వీరిని ఉపయోగించుకొని గంగారాన్ని అభివృద్ధి బాటలో తీర్చిదిద్దుకోవాలని ప్రజలకు తెలియజేశారు. గంగారం తరపున ఏమి కావాలన్నా అభివృద్ధిలో నేను ముందు ఉంటానని,ప్రతి పనికి తోడ్పాటుగా సేవలు అందిస్తానని తెలియజేశారు. ప్రజల అవసరాల కోసం కరెంట్ పోల్స్, లైటింగ్, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్, డ్రైనేజీ, సిసి రోడ్లు, పరిశుభ్రతకు తీర్చిదిద్దటం, మంచినీటికి ఇబ్బంది లేకుండా చూడటం, బోర్లు వేపించటం అనేక విషయాల్లో తనదైన శైలిలో అభివృద్ధి చేశారని దానికి నిదర్శనంగా,ఆదర్శంగా ఆయన పనులు ఉన్నాయని కొనియాడారు. సమాజంలో కోట్ల కోట్లు డబ్బులు ఉంటాయి కానీ,ఖర్చు పెట్టడానికి, దానం చేయడానికి ఎట్టి పరిస్థితుల్లో ముందుకు రారని, గంగారం అంటేనే ఎవరికైనా గుర్తొచ్చేది దాసరి కుటుంబం అని,ఆ కుటుంబం అంటేనే పేద ప్రజల కుటుంబమని, ప్రజల కోసం పాటుపడేవారు అని గతంలోవారు చేసిన కార్యక్రమాలను తెలియజేశారు. ముందు ముందు కూడా ఇంకా మంచి అభివృద్ధి చేయాలని, ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు కాకర్ల రేవతి, ఒంటెద్దు వెంకటమ్మ సాయిలు, ఉప సర్పంచ్ బెజవాడ రాధా, గంగారం గ్రామ శాఖ అధ్యక్షుడు కావేటి అప్పారావు, కోలగట్ల చెన్నారావు, బెజవాడ శ్రీనివాసరావు,బండారు మారేశ్వర రావు,కరాటే రమేష్, యామాల ముత్యాలరావు, కాకర్ల మాణిక్యాలరావు, జల్లిపల్లి వాసుదేవరావు, కోటమర్తి జవహర్లాల్,చిన్ని, వెంకటేశ్వరరావు,కాలసాని నాగేశ్వరరావు,రాచమల్ల నాగేంద్రరావు,బండారి జగదీష్, కొవ్వారపు కన్నయ్య,ఎస్కే సుభాని,కోవారపు గిరిబాబు, చల్లారి సత్యనారాయణ, కొండపల్లి మహేష్,బెజవాడ మనోజ్,మొగిలిచర్ల సత్యనారాయణ, కాంగ్రెస్ అభిమానులు, మధు బాబు యువసేన సభ్యులు ఉన్నారు.

# జీఎస్టీ నిల్.. జేబులు ఫుల్లు!

★ అశ్వరావుపేటలో వరలు, సిమెంట్ పోల్స్, ఇతర సామాగ్రిపై జీఎస్టీ దందా?

★ బిల్లులు ఉన్నాయా?.. ప్రభుత్వ ఖజానాకు చేరుతున్నాయా?.. సంబంధిత అధికారుల జాడేదీ?

★ జీఎస్టీ పేరుతో ఎంత మొత్తం వసూలు చేస్తున్నారు? ★ ప్రతి కొనుగోలుదారుడికి అధికారిక ట్యాక్స్ ఇన్వాయిస్ ఇస్తున్నారా? ★ విక్రయదారులందరికీ చెల్లుబాటు అయ్యే జీఎస్టీ నమోదు ఉందా? ★ వసూలు చేసిన జీఎస్టీ మొత్తం ప్రభుత్వ ఖజానాకు చేరుతోందా? ★ సంబంధిత అధికారులు చివరిసారిగా ఎప్పుడు తనిఖీలు చేశారు? ★ అక్రమాలు తేలితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ★ విచారణ చేస్తేనే నిజాలు వెలుగులోకి..

అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 4 అశ్వరావుపేట: ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను సక్రమంగా చెల్లిస్తున్నారా? వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న జీఎస్టీ నిజంగా ప్రభుత్వ ఖజానాకు చేరుతోందా? లేక కొందరి జేబులు నింపే మార్గంగా మారుతోందా? అశ్వరావుపేట పరిసర ప్రాంతాల్లో వరలు, సిమెంట్ పోల్స్, నిర్మాణాలకు ఉపయోగించే ఇతర సామాగ్రి విక్రయాలపై జీఎస్టీ వసూళ్లపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సామాగ్రి కొనుగోలు సమయంలో ధరతో పాటు జీఎస్టీ పేరుతో అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఆ మొత్తానికి సరైన ట్యాక్స్ ఇన్వాయిస్ ఇస్తున్నారా? జీఎస్టీ నంబర్ కలిగిన వ్యాపార సంస్థలే విక్రయాలు చేస్తున్నాయా? వసూలు చేసిన పన్నును నిర్ణీత కాలంలో ప్రభుత్వానికి జమ చేస్తున్నారా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.జీఎస్టీ పేరుతో వసూలు... బిల్లు మాత్రం ఎక్కడ?కొన్ని చోట్ల సామాగ్రి కొనుగోలు చేసిన వినియోగదారులకు సాధారణ రసీదులు లేదా చేతిరాత బిల్లులు మాత్రమే ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీఎస్టీ వసూలు చేస్తే తప్పనిసరిగా సరైన పన్ను ఇన్వాయిస్ ఇవ్వాల్సి ఉంటుంది. అందులో వ్యాపార సంస్థ వివరాలు, జీఎస్టీ నంబర్, వస్తువుల విలువ, పన్ను శాతం, పన్ను మొత్తం వంటి వివరాలు స్పష్టంగా ఉండాలి. అయితే అశ్వరావుపేట ప్రాంతంలో వరలు, సిమెంట్ పోల్స్, ఇతర నిర్మాణ సామాగ్రి విక్రయాల విషయంలో ఈ నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది అధికారులే తేల్చాల్సి ఉంది.పన్ను ప్రభుత్వానికా... జేబులకా?వినియోగదారుల నుంచి జీఎస్టీ పేరుతో డబ్బులు వసూలు చేసి, సరైన బిల్లు ఇవ్వకపోతే ఆ మొత్తాలు ప్రభుత్వ ఖజానాకు చేరుతున్నాయా లేదా అన్న అనుమానం సహజంగానే వస్తోంది. నమోదిత వ్యాపారులు కాకుండా ఎవరైనా జీఎస్టీ పేరుతో అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారా? నకిలీ లేదా తప్పుడు బిల్లుల వ్యవహారం జరుగుతోందా? అన్న కోణంలో సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.సంబంధిత శాఖల తనిఖీలు ఎక్కడ?పన్నుల శాఖ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, సంబంధిత స్థానిక అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? వ్యాపార సంస్థల రికార్డులు పరిశీలిస్తున్నారా? జీఎస్టీ నమోదు, కొనుగోలు--అమ్మకాల లెక్కలు, ఇన్వాయిస్‌లపై తనిఖీలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమాలు లేకపోతే తనిఖీలు చేసి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.జీఎస్టీ వ్యవహారంపై ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను తేల్చాల్సిన అవసరం ఉంది. సరైన బిల్లులు, పన్ను రికార్డులు పరిశీలించి నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

### ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు.ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

## ఢిల్లీలో కుండపోత వర్షం

### జలమయమైన విమానాశ్రయం
### విమాన సేవలకు తీవ్ర అంతరాయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## కొండా సురేఖను తొలగించారు..

### పొంగులేటి సంగతి ఏమిటి?:
### బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

### లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి తరఫున ఆహ్వానం అందింది. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడి, ఆవిష్కరణ వ్యవస్థలతో అనుసంధానించడంలో కేటీఆర్‌కు ఉన్న అనుభవం యూరప్‌లోని పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులకు ఉపయోగపడుతుందని తమ ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. బ

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు

మొదటిపేజీ తరువాయి..



కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది. స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డుపైనే వంట చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆరోపించారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ మహిళలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు,వికలాంగులు, మహిళలకు రూ. 2500, కేసిఆర్ కిట్టు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ (తులం బంగారం), విద్యార్థులకు స్కూటీ హామీలు మరిచిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు వంటవార్పు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులునిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆల వెంకటేశ్వర్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి, ప్రజలకు మద్దతుగా పోరాడుతున్న బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు. మీ పోరాటాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. కాగా, జిల్లాలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో 1000 రోజుల కాంగ్రెస్ విఫల పాలనకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలకు ఆల వెంకటేశ్వర్ రెడ్డి దీటుగా సమాధానమి చ్చారు. అలాగే అడ్డుకునేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడి నుంచి తరిమికొట్టారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలో కేటీఆర్ ఫోన్ చేసి ప్రజల తరఫున ఉద్యమిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు.

ప్రజా పాలన పేరిట రాష్ట్రాన్ని దొంగల మాదిరిగా దోపిడీ చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన జనగాం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ) , బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అయినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా పాలన అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. సమైఖ్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి సహించలేక కేసీఆర్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి లో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు కు ముందు నీళ్ళు, విద్యుత్ కోసం ప్రజలు అల్లాడిపోయారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక 24 గంటల విద్యుత్ సరఫరా, చెరువుల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్ట్ ల నిర్మాణం వలన ధాన్యం ఉత్పత్తి లో మొదటి స్థానంలో నిలిచి దేశానికే అన్నపూర్ణ గా మారిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్, నీటి సమస్యలు ఎందుకు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలను ఏ విధంగా మోసం చేశారో ప్రజలకు వివరించి దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. వారసత్వంగా వచ్చిన, పేదల ఇండ్లు, భూముల ను 22 ఏ పరిధిలోకి తీసుకొచ్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు రీ యంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లను ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఈ ప్రభుత్వం ఆటలాడుకుంటున్నదని ధ్వజమెత్తారు. ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



# సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

### రాజగోపాల్‌రెడ్డిని కూడా బీఆర్ఎస్‌లోకి తీసుకోం
### మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.



సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఆయనను తమ పార్టీలోకి తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి రావాలని ప్రయత్నాలు చేశారని పేర్కొన్న మాజీ మంత్రి.. అయినప్పటికీ ఆ ప్రయత్నాలను తమ పార్టీ తిరస్కరించిందని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌పై, పార్టీ నాయకత్వంపై నేరుగా విమర్శలు చేశారని.. అలాంటి వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన జగదీశ్‌రెడ్డి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై కొండా కుటుంబం అవినీతి ఆరోపణలు చేసిందని.. వాటిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని తాము ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలు పంపించామని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ బీఆర్ఎస్ నేత చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత సంస్థల అధికారిక నిర్ధారణ వెలువడలేదని గమనించాలి.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంలో ఉందని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నందున కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు.

ఆ దాడులపై ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మద్దతు ఉందని ఆరోపించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా వ్యవహరించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగకపోయినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరిగే అవకాశం ఉందని జగదీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, డీలిమిటేషన్ ద్వారా ఆ రాజకీయ పరిస్థితి నుంచి బయటపడవచ్చని చంద్రబాబు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

### సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా



చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

### బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు నేను ముందే చెప్పాను..
### ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): "కేసీఆర్‌కు ముందే చెప్పాను. రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే" అని ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సైదాబాద్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము గతంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చామని, అది నిజం అన్నారు. కానీ తాను పదే పదే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా చెబుతూనే ఉండేవాడినన్నారు. రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోండి.. లేకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని చెప్పుండేవాడనన్నారు. "ఇప్పుడు ముఖ్యమైన విషయం ఏమిటంటే... సీఎం సాబ్, మీరు కాస్త మరీ ఎక్కువ మర్యాదస్తుడిగామారిపోయారు. కాస్త మీ పాత దూకుడు చూపించండి, ప్రజల్లోకి రండి. మిమ్మల్ని ఏ విషయం ఆపుతోందో నాకైతే అర్థం కావడం లేదు. హనుమంతరావు సాబ్, మీరేమైనా చెబుతారా వచ్చి? నేను చెప్పింది తప్పు కాదు కదా? మీరు కూడా నాతో ఏకీభవిస్తున్నారు కదా... మీరు ఒప్పుకుంటున్నారు... మీరొక సీనియర్ నాయకులు, మీరే ఒప్పుకున్నారంటే ఇక అంతే, నేను సరైన మాటే చెప్పాను. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, యావత్ తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ ప్రగతి సాధించాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీపై ప్రశంసలు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఓవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమనే ప్రచారం కేవలం కొందరి దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. అసదుద్దీన్ ఓవైసీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్బరుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీలతో కలిసి పాతబస్తీ అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. గతంలో ఎంతమంది సీఎంలు ఓల్డ్ సిటీకి వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీ అభివృద్ధికి అసదుద్దీన్ ఓవైసీ ఏ ప్రతిపాదన తీసుకొచ్చినా పరిశీలించి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

## సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు

హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజాజ్యోతి): తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967